


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 25-01-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 132 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అందాల నటి కృష్ణకుమారి కన్నుమూత



వార్త 8లో..

## గజల్ శ్రీనివాస్‌కు షరతులతో బెయిల్



హైదరాబాద్: లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరైంది. నాంపల్లి న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10వేల నగదు పూచీకత్తు ఇవ్వాలని, ప్రతి బుధ, ఆదివారాల్లో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఇదే కేసులో ఏ2 నిందితురాలు పార్వతికి కూడా ముందస్తు బెయిల్‌ను మంజూరు చేశారు.

### ఆంధ్ర రాష్ట్రం

# స్టేట్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మారాలి

- విద్యార్థుల విజయమే ఉపాధ్యాయుల కీర్తి
- సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి
- చదువు పూర్తికాగానే ఉద్యోగ అవకాశాలు వుండాలి
- విద్యార్థులు - ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ విధానం వుండాలి
- టెక్నాలజీ ఫెసిలిటేటర్ కావాలి - మౌలిక వసతులపైదృష్టి పెట్టాలి
- వీసీలకు నిర్దేశించిన రాష్ట్ర గవర్నర్ నరసింహన్



విశాఖపట్నం : విశ్వవిద్యాలయాలు దేవాలయాల వంటివి, నాణ్యమైన విద్యనందించడంతోపాటు గురు-శిష్య పరంపర కొనసాగించాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల చాన్సలర్ ఇఎస్ఎల్ నరసింహన్ వీసీలకు పిలుపునిచ్చారు. గురువు తండ్రివంటివారని, విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధిస్తే గురువుకు అమితానందం కలుగుతుందని, దీనిని ప్రతీ ఉపాధ్యాయుడు అనుభవిఛాలని అన్నారు. బుధవారం ఆంధ్రా యూనివర్శిటీ సెనేట్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం



విడిపోయిన తరువాత 43 నెలల కాలంలో రాష్ట్రం అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ప్రాథమిక, మాధ్యమిక విద్యలతో పాటు హయ్యర్ ఎడ్యుకేషన్ అనేది అతి ముఖ్యమైనదన్నారు. ప్రతీ విద్యార్థినీ నైపుణ్యంతో పాటు నూతన రంగాలలో ప్రావీణ్యాన్ని సాధించే విధంగాను, ఇన్నోవేటివ్‌గా సమాజానికి ఉపయోగపడేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలైన ఓడిఎఫ్, స్వచ్ఛ భారత్ తదితరాలలో పాల్గొని సమాజ సేవ చేసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ఎక్కువ యూనివర్శిటీలలో ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నాయని, వాటిని అనుభవజ్ఞులైన అడ్‌హాక్ సిబ్బందితో నింపాలని అన్నారు. అన్ని విశ్వవిద్యాలయాలు యూనిఫాంగా వుండేలా అకడమిక్, పరీక్షలు, ఫలితాలు, తదితర అంశాలతో కూడిన కామన్ కాలండర్‌ను రూపొందించాలన్నారు. ఆంధ్రా యూనివర్శిటీ అనేక మంది స్కాలర్స్‌ను, మేధావులను అందించిందని, మిగిలిన విశ్వవిద్యాలయాలూ దీనితో పోటీపడాలన్నారు. అన్ని యూనివర్శిటీలలో మౌలిక వసతుల కల్పనపై వీసీలు దృష్టిపెట్టాలని, విశ్వవ్యాప్తమైన విద్య వుండేలా చూడాలని, విదేశీ విద్యను, పద్ధతులను అద్యయనం చేసి ఉత్తమ పద్ధతులను ఇక్కడ అవలంబించేలా చూడాలని అన్నారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ తరువాయి 2లో

# ప్రజా సమస్యలే వైకాపా మేనిఫెస్టో




- బాబు పాలనలో రాజ్యాంగ స్ఫూర్తి ఏది?
- ప్రతిపక్షం, మహిళలు, దళితులు, మీడియాపై టీడీపీ దాడి
- అన్యాయం, అక్రమాలు, ధనార్జనే ధ్యేయంగా టీడీపీ పాలన
- ఈ నెల 29తో వెయ్యికిలోమీటర్ల మైలురాయికి ప్రజాసంకల్పయాత్ర
- వెంకటగిరి నియోజకవర్గంలో స్తూపం ఏర్పాటు
- వైఎస్సార్సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి

విశాఖపట్నం: రాష్ట్రాన్ని పరిపాలనిస్తున్న టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురౌతున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోని నాథుడే కరువైన తరుణంలో ప్రజా సమస్యలే ఎజెండాగా ప్రజల వద్దకు వెళ్తున్న వైకాపాకి రాబోయే ఎన్నికల్లో ప్రజా సమస్యలే ముఖ్య మేనిఫెస్టోగా చేసుకుని ఎన్నికలకు సిద్ధమౌతామని వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలియజేశారు. వైఎస్సార్సీపీ సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి ఆయన బుధవారం విశాఖపట్నంలో విలేకరులతో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో విజయసాయి రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, రాజ్యాంగ నిర్మాతలు ఊహించినదానికి భిన్నంగా చంద్రబాబు పాలన సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి మండిపడ్డారు. తరువాయి 2లో


# మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చా



ఖమ్మం: మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్టు జనసేన అధినేత, ప్రముఖ సినీనటుడు పవన్ కల్యాణ్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో యువత రాజకీయాల మార్పుపై దృష్టిపెట్టాలన్నారు. ఉడుకు నెత్తురుతో ఉన్న యువత తమతో కలిసి రావాలని కోరారు. బుధవారం ఆయన ఖమ్మం జిల్లాలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను రాజకీయాల్లోకి రావడానికి నల్గొండ ఫ్లోరైడ్ సమస్య కూడా ఓ కారణమని అన్నారు. తరువాయి 2లో

## సౌరవిద్యుత్ వినియోగంలో వృద్ధిసాధించాలి

- వారి తొలి వాహనం ఎలక్ట్రిక్ కావాలి
- ప్రతి కుటుంబానికి ఎల్పీజీ ఉండాలి
- దావోస్ సదస్సులో కేంద్రమంత్రి పీయూష్ గోయల్



దావోస్: భారత జనాభాలో ఇప్పటికీ 80శాతం మందికి సొంత వాహనాలు లేవని, అలాంటి వారి తొలి వాహనం ఎలక్ట్రిక్ వాహనం కావాలని తాము కోరుకుంటున్నామని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో డిజైనింగ్ ఫర్ స్మార్ట్ మొబిలిటీ అంశంపై ఆయన మాట్లాడారు.

పాశ్చాత్య దేశాల్లో ప్రతి ఒక్కరికీ సొంత వాహనం ఉంటుంది. భారత్ వంటి దేశాల్లో ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితిలో వృద్ధి కనిపిస్తోంది. తరువాయి 2లో

# లాలూకు మరో ఐదేళ్లు జైలు



రాంచీ: దాణా కుంభకోణానికి సంబంధించి మూడో కేసులో దోషులుగా తేలిన ఆర్జేడీ అధినేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఆయనతో పాటు దోషిగా తేలిన మాజీ సీఎం జగన్నాథ మిశ్రాకు కూడా ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు కోర్టు వెల్లడించింది. దీంతో పాటు ఇద్దరికీ రూ.5లక్షల చొప్పున జరిమానా విధించింది. బుధవారం ఉదయం విచారణ చేపట్టిన సీబీఐ న్యాయస్థానం వీరిద్దరినీ దోషులుగా తేల్చింది. మధ్యాహ్నం శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది. ఇప్పటికే లాలూ ప్రసాద్ యాదవ్ రెండో దాణా కుంభకోణం కేసులో మూడున్నరేళ్ల జైలు శిక్షను అనుభవిస్తున్నారు. ప్రస్తుతం ఆయన బిర్సా ముండా కేంద్ర కారాగారంలో ఉన్నారు.

మూడో దాణా కుంభకోణం కేసులో ఛాయ్‌బసా ఖజానా నుంచి రూ.36కోట్లు అక్రమంగా పొందినట్లు లాలూ, మిశ్రాపై కేసు నమోదైంది. 2013 మొదటి దాణా కుంభకోణం కేసులో లాలూకు అయిదేళ్ల జైలు శిక్ష పడింది. ఆయనపై మొత్తం ఐదు దాణా కుంభకోణం కేసులు ఉన్నాయి. రెండో దాణా కుంభకోణం కేసులో ఈనెల 6న లాలూకు మూడున్నరేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఇదే సీబీఐ న్యాయస్థానం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఇంకా ఆయనపై దమ్‌కా ఖజానా నుంచి రూ.3.97కోట్లు, తరువాయి 2లో



# రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి

## - కలెక్టర్ ప్రవీణ్‌కుమార్



విశాఖపట్నం : 2015వ సంవత్సరంలో బ్రెజిల్ రాజధాని బ్రెజిలియాలో చేసిన అంతర్జాతీయ రహదారి భద్రత డిక్లరేషన్ తదుపరి చర్యలలో భాగంగా రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని అప్పటి నుండి జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాలను తీవ్రతను దృష్టిలో పెట్టుకొని జాతీయ రహదారిపై ఉండే బ్లాక్ స్పాట్స్‌ను సరిచేసే కార్యాచరణ మొదలు పెట్టామని ఇందులో భాగంగా డి.టి.సి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గీతం మరియు మహారాజ ఇంజనీరింగ్ కళాశాలల ప్రొఫెసర్ల సహకారంతో ఇచ్ఛాపురం నుండి తుని వరకు నేషనల్ హైవేను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడం జరిగిందన్నారు. ఈ సర్వేలో విశాఖలో 100 బ్లాకు స్పాట్స్‌ను గుర్తించారని వాటిని సరిచేసే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు.

ప్రతినెల మూడవ మంగళవారం రహదారి భద్రత కమిటీ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు.

# చౌప్పెల్లలో పొలం పిలుస్తోంది



ఆలమూరు : మండల పరిధి చొప్పెల్లలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.వి.ఎన్.రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందుబాటులో వున్న రైతుసేవ అనే అప్లికేషన్, ప్లాస్టిక్స్ యాప్స్ గురించి రైతులకు వివరించారు. అలాగే ఎరువులు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. నీటి యాజమాన్య పద్ధతులపై వరిచేలకు నీరు ఆరబెట్టడం, నీరు పెట్టుట వలన దుబ్బు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి చిన్నం భువనేశ్వరి, ఎంపిఈఓ మనోహర్ రైతులు ధర్మాసుల వెంకట్రావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# హోప్ ఆధార్ ప్లస్ ద్వారా బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేత



ఆలమూరు : మండల కేంద్రం, ఆలమూరు ఎర్ర కాలనీకి చెందిన గండ్రోతు రామారావు కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో స్థానిక హోప్ ఆధార్‌ప్లస్ అనే సంస్థ 161వ ఈవెంట్‌లో భాగంగా బుధవారం గండ్రోతు రామారావు కుటుంబానికి 50కేజీలు బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేసారు. ఈ సందర్భంగా హోప్ టీమ్ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం ఆ కుటుంబానికి వున్న ఆర్థిక పరిస్థితులలో కొంతైనా సహాయ పడగలదని ఆశిస్తున్నామని అందరి సహకారంతో భవిష్యత్తులో కూడా హోప్ అలాంటి వారికి అండగా నిలబడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైయస్సార్‌సిపి సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, శ్రీకృష్ణదేవరాయ కాపుసంఘం గౌరవ అధ్యక్షులు రామానుజుల శేషగిరిరావు, సంఘ అధ్యక్ష కార్యదర్శులు చల్లా సత్యనారాయణ (నానాజీ), ఎలుగుబంట్ల సాయి, తదితరు లు మాట్లాడుతూ హోప్ అంటే నమ్మకం, ఆ నమ్మకమే ప్రతీ పేదవారి కళ్లల్లో వెలుగులు నింపుతుందని హోప్ సంస్థ వారు పేదరికానికి అండగా వుండి ఇటువంటి మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని వారు కొనియాడారు.

# 'అమ్మ'కు వందనం



అమలాపురం : జనుపల్లి గ్రామం ఇల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.వీరభద్రుడు అధ్యక్షతన అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు వారి మాతృ మూర్తులకు వందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుట్టుగుళ్ల జ్యోతి సత్తిబాబు, ఉప సర్పంచ్ వేమన బాబూరావు, ఎంపిటిసి ఈతకోట సత్యవతి, గ్రామ పెద్దలు వేమన అన్నవరం, చుట్టుగుళ్ల వీరవెంకట సత్యనారాయణ, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ అప్పారి శేషు శివన్నారాయణ, సభ్యులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలను బ్రతకనిద్దాం - చదవనిద్దాం

ఆలమూరు : ఆడపిల్లలను బ్రతకనిద్దాం - చదవనిద్దాం అనే సూక్తిని నిజం చేయడానికి అందరూ కృషి చేయాలని స్థానిక బొబ్బా జయశ్రీ జెడ్‌పి బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.వెంకటలక్ష్మి అన్నారు. ఆలమూరు శ్రమ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న హెచ్.ఎమ్. వెంకటలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమనే భావన ప్రజలలో కల్పించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వినియోగించుకని బాలికల విద్యను ప్రోత్సాహించాలని, అక్షర జ్ఞానంతోనే దేన్నయినా సాధించవచ్చని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలతో పాటు శ్రమ టీమ్ సభ్యులు జి.వి.ఎ. దుర్గాదేవి, పి.నాగేశ్వరి, వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



హిందీని రాజభాషగా కేంద్ర ప్రభుత్వ సంస్థలో అమలు పరిచే ప్రక్రియలో భాగంగా కస్టమ్స్ విభాగంలో పార్లమెంటు సబ్-కమిటీ బుధవారం నాడు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌ను సందర్శించింది. కమిటీ సభ్యులకు విశాఖ పోర్టు ట్రస్ట్ డిప్యూటీ ఛైర్మన్ హరినాధ్ స్వాగతం పలికి విశాఖ పోర్టు విశేషాలు, దాని ప్రాముఖ్యత మరియు మౌలిక వసతులు తదితర విషయాలను గూర్చి వివరించారు.

# విద్యుత్ కార్మికులకు జనసేన సంఘీభావం



కాకినాడ : విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద గత నాలుగు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు జనసేన పార్టీ నాయకులు మద్దత్తు పలికారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద గల శిభిరానికి జనసేన నాయకులు , పవన్ అభిమానులు అధిక సంఖ్యలో చేరుకున్నరు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు కుంపట్లగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం స్పందించి విద్యుత్ కార్మికులన్యాయపరమైన కోర్కెలు వెంటనే పరిష్కారించాలన్నారు. కార్మికులకు జనసేన, పవన్ అభిమానులు అండగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలబాబు, దేవుమధువీరేష్, టి.చందు, సిహెచ్ బన్ని, జి.స్వరూప, కెఈశ్వరి, రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య శేషారెడ్డికి వివేకానంద జీవనసాఫల్య పురస్కారం



కాకినాడ : ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డికి వివేకానంద జీవన సాఫల్య పురస్కారంతో శ్రీరామకృష్ణ సేవాసమితి సత్కరించి,రూ.25వేల నగదు అందజేసారు. శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం అనపర్తి జిబిఆర్.విద్యాసంస్థ ఓపెన్ ఆడిటోరియంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన తిరుపతి వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి వై.హరిబాబు ముఖ్యఅతిధిగా విచ్చేసారు.

# పిహెచ్‌డిలు అందచేత

కాకినాడ /గండేపల్లి : ఆదిత్య గ్రూప్‌ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ ఫార్మసీ కళాశాలకు చెందిన పలువురు అధ్యాపక సిబ్బందికి జెఎన్‌టియుకె విశ్వ విద్యాలయం ఆరవ స్నాతకోత్సవంలో జెఎన్‌టియుకె వైస్ ఛాన్సలర్ విఎస్ఎస్‌కుమార్ చేతుల మీదుగా పిహెచ్‌డి, డాక్టరేట్ పట్టాలు అందుకున్నారని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ డా.మేడపాటి శ్రీనివాసరెడ్డి (మెకానికల్), డా.వి.వి.కామేష్, డా.వి.శ్రీనివాసరావు, డా.ఆర్‌విఎస్.లలిత(కంప్యూటర్ సైన్స్), డా.పాలాక్షలు (ఫార్మసీ ప్యాకల్టీ)విభాగం నుండి ఈ గౌరవం దక్కిందన్నారు. ఈసందర్భం గా ఆదిత్యవిద్యా సంస్థల ఛైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని ప్రతిఒక్కరూ తమలో దాగివున్న మేధాశక్తికి పదును పెడితే ఉన్నత శిఖరాలు అధిరోభించ వచ్చన్నారు. వీరి శిక్షణలో విద్యార్థులు మంచి నాణ్యమైన విద్యను అభ్యసించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు.

**పాసుపుస్తకాలు పోయినవి**

**ఉరిటి గోవిందరావు, సన్ ఆఫ్ అన్నాజీరావుకు చెందిన పట్టాదారు పాసుపుస్తకాలు పోయినవి. కొర్లయ్యపేట సర్వే నెంబరు 288-6లోని ఎకరాన్నర తాలుకా పాసు పుస్తకాలు పోయినవి. ఆచూకీ తెలిసిన వారు 9700106655 ఫోన్ నెంబరుకు సమాచారం ఇవ్వగలరు.**

మొదటి పేజీ తరువాయి

# ఆంధ్ర రాష్ట్రం స్టేట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మారాలి

మంత్రి హయ్యర్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల పెర్ఫారెన్స్ తెలుసుకునేందుకు బయోమెట్రిక్ అటెండెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అన్ని విద్యాలయాలలోను డిజిటలైజేషన్‌తో పాటు డిజిటల్ లైబ్రరీలను వాడుతున్నారన్నారు. రాష్ట్రంలో యూనివర్శిటీలన్నింటికీ మంచి ర్యాంకులు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఆంధ్ర రాష్ట్రం స్టేట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మారాలన్నారు. ఇన్నోవేషన్స్‌లో విద్యార్థులు ఈ సంవత్సరం మంచి స్థానాలలో నిలవాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్రావు ఎడర రాసిన వేస్ టు సక్సీడ్ ఇన్ యాన్ ఇంటర్వ్యూ ఫర్ యువర్ డ్రీమ్ జాబ్ పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు.ఆంధ్రప్రదేశ్‌లో గల అన్ని యూనివర్శిటీలకు చెందిన వైస్ చాన్సలర్‌లతో తాను సమావేశమై వారితో మాట్లాడటం ఎంతో ఆనందంగా ఉందని గౌరవ గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్శిటీలో ఈ సదస్సు జరగడం గర్వించదగ్గ విషయమని అన్నారు. నూతన రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటిగా కేబినెట్ సమావేశం నిర్వహించిన చోటనే ఈ సమావేశం నిర్వహించడం విశేషమన్నారు. ఈ చర్చల్లోని సిఫార్సులను, సూచనలను ప్రభుత్వపరంగా అమలు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఏపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ విజయరాజు, ఆంధ్రా యూనివర్శిటీ వీసీ ఆచార్య నాగేశ్వరరావు, ఇంక్యుబేషన్ సెంటర్ సిఇఓ ఆచార్య వల్లి కుమారి, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాధ్ దాస్, రాజ్‌భవన్ ముఖ్య కార్యదర్శి హర్‌ప్రీత్ సింగ్, శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ, శ్రీ కృష్ణా, పద్మావతి, యోగివేమన, ద్రవిడ, నాగార్జున, రాయలసీమ, జెఎన్టీయూ కాకినాడ, అనంతపురం ఉర్దూ యూనివర్శిటీ, రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ, బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలకు చెందిన పలువురు వీసీలు ఆచార్యులు హాజరయ్యారు.

***గవర్నర్‌ను కలిసిన మంత్రి గంటా శ్రీనివాసరావు***

ఆంధ్రప్రదేశ్ గవర్నరు ఈఎస్ఎల్ నరసింహంను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు బుధవారం సర్క్యూట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయం 9 గంటలకు ప్రత్యేక విమానంలో గవర్నర్ విశాఖపట్నం చేరుకున్నారు. ఆయనకు జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీసు కమిషనర్ టి. యోగానంద్, వుడా వైస్ ఛైర్మన్ పి. బసంత్ కుమార్, జివిఎంసి కమిషనర్ ఎం. హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ట్రయినీ కలెక్టర్ విషాసింగ్ తదితరులు స్వాగతం పలికారు.

# మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చా..

బీఆర్ అంబేడ్కర్, పూలే విధానాలతో ముందుకెళ్తానన్నారు. దేశంలో కులాలు అంతం కావాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి దాడులకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. జనసేన ద్వారా ప్రజా సేవ చేసేందుకే ప్రజల్లోకి వచ్చానని పవన్ అన్నారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల పర్యటనలో భాగంగా కొత్తగూడెం జిల్లా నుంచి రోడ్ షో ద్వారా పవన్ బుధవారం ఉదయం ఖమ్మంకు చేరుకున్నారు. అనంతరం ఎంబీ గార్డెన్స్‌లో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ మాట్లాడారు. జై తెలంగాణ జైహింద్ అన్న నినాదాలు తనకెంతో ఇష్టమన్నారు. తెలంగాణ జిల్లాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుంటూ ప్రజలకు పరిష్కారాలు చూపేందుకు యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఏళ్లు గడిచినా నల్గొండ జిల్లావాసుల ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం దొరకడంలేదన్నారు. ఫ్లోరైడ్ బాధితులను చూస్తే చెప్పలేనంత బాధ కల్గుతోందని పవన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఫ్లోరైడ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తానన్నారు. ప్రజా సమస్యల కోసం వచ్చిన వ్యక్తిపై కొందరు దుందుడుకు స్వభావం ప్రదర్శిస్తున్నారని, అయితే తమకు పూర్తి సహనం ఉందన్నారు. మళ్లీ వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు వస్తానని పేర్కొన్నారు. తన ప్రసంగంతో అభిమానులు, కార్యకర్తల్లో పవన్ నూతన ఉత్సాహాన్ని నింపారు.

***అభిమానులను కలవలేకపోతున్నా: పవన్***

ప్రజాయాత్రలో బాగంగా అభిమానులను కలవడం కుదరడం లేదని.. వారు దయచేసి అర్థం చేసుకోవాలని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. తెలంగాణ జిల్లాలో ప్రజాయాత్ర నిర్వహిస్తున్న పవన్.. మంగళవారం రాత్రి కొత్తగూడెంలోని సింగరేణి అతిథిగృహంలో ఆయన బస చేశారు. ఈరోజు ఉదయం ఖమ్మంకి బయలుదేరుతూ ఆయన మీడియాతో మాట్లాడారు. తాను కొత్తగూడెంకు 2009లో వచ్చానని.. ఇక్కడి సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. కొత్తగూడెంలో అపారమైన ఖనిజ సంపద ఉందని.. ఇక్కడ మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరతానన్నారు.

***పవన్‌ను కలిసిన శ్రీజ***


తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ప్రాణ గండం నుంచి బయటపడిన బాలిక శ్రీజ ఈరోజు కొత్తగూడెంలో పవన్‌ను కలిసింది. అప్పట్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తనకు పవన్ కల్యాణ్‌ను చూడాలని శ్రీజ కోరింది. విషయం తెలుసుకున్న పవన్ బాలికను కలిసి పరామర్శించారు. ఆమె తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీజ కోలుకుంది.

# ప్రజా సమస్యలే వైకాపా మేనిఫెస్టో

ప్రతిపక్షం, మహిళలు, దళితులు, మీడియాపై దాడులు పెరిగిపోయాయని, అన్యాయం, అక్రమాలు, ధనార్జనే ధ్యేయంగా టీడీపీ పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. వ్యవస్థలను మేనేజ్ చేసే ఘనుడు చంద్రబాబు అని, ప్రభుత్వంలోని న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ నుంచి 22మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారని, వారిలో కొందరిని మంత్రులుగా చేసి.. రాజ్యాంగ వ్యవస్థను నీరుగార్చారని విజయసాయిరెడ్డి విమర్శించారు. అనర్హత వేటువేయాల్సిన ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రిపదవులు ఇవ్వడం ఇదే తొలిసారి అని అన్నారు. ఒక సామాజిక వర్గానికి కొమ్ము కాస్తూ.. మిగతా సామాజిక వర్గాలను, ప్రజలను విస్మరించేలా కార్యనిర్వాహక యంత్రాంగం వ్యవహరిస్తోందని అన్నారు. ప్రాజెక్టులు, కాంట్రాక్టుల ద్వారా ఆర్జించిన అవినీతి సొమ్మును మనీలాండరింగ్ ద్వారా విదేశాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. డీజీపీ నియామకం విషయంలో అకస్మాత్తుగా మార్పులు చేసి.. తన అడుగులకు మడుగులొత్తేవాళ్లని నియమించుకున్నారని దుయ్యబట్టారు. ఫైబర్ గ్రిడ్ పేరుతో డిజిటల్ మీడియాతో నియంత్రించే పరిస్థితిని చంద్రబాబు తీసుకొచ్చారని, తనకు గిట్టని చానెల్లను, వ్యతిరేక చానెల్లను లాకౌట్ చేసే పరిస్థితి కల్పించారని అన్నారు. అనుమతిలేని బోటులో రాష్ట్రపతి సతీమణిని ప్రయాణించేలా చేసి చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రానికి అపకీర్తి తెచ్చిందని అన్నారు. వైఎస్సార్సీపీ కార్యకర్తలను నడిరోడ్డుమీద నరికి చంపినా.. అందుకు బాధ్యులను అరెస్టు చేయడం లేదని, చట్టవ్యతిరేక శక్తులను బాబు ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. ఏపీకి ప్రత్యేక హోదా సంజీవిని.. హోదా సాధించేవరకు పోరాటం చేస్తూనే ఉంటామని విజయసాయిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు డాక్టర్ మళ్ళా విజయప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు గొల్ల బాబురావు, తైనాల విజయకుమార్, సమన్వయకర్తలు వంశీ కృష్ణ శ్రీనివాస్, తిప్పల నాగిరెడ్డి, వరుదు కల్యాణి, పీతల మూర్తి యాదవ్, దివాకర్ పక్కి, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

***కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగులకు అండగా వైకాపా***

గత కొద్ది రోజులుగా కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షలకు వైకాపా తరఫున సంఘీభావం తెలిపేందుకు రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. వీరితోపాటు శాసనమండలి ప్రతిపక్షనేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ సాయి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు భద్రత లేకుండా పోతోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో బాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన వారిలో పలువురు వైకాపా నేతలు పాల్గొన్నారు.



# సౌరవిద్యుత్ వినియోగంలో వృద్ధిసాధించాలి

భారత జనాభాలో ఇప్పటికీ 80 శాతం మందికి సొంత వాహనాలు లేవు. అలాంటివారి తొలి వాహనం ఎలక్ట్రిక్ వాహనం కావాలని కోరుకుంటున్నాం అని గోయల్ తెలిపారు. దేశంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగం శరవేగంగా వృద్ధి చెందుతోందని చెప్పారు. సౌరవిద్యుత్ వినియోగంలో గత 3.5 ఏళ్లలో 6 రెట్ల వృద్ధిని సాధించామని, 2022 నాటికి 10గిగావాట్ల ఉత్పత్తిని అందుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. దేశంలో ఎల్‌ఈడీ బల్బులను వినియోగంలోకి తెచ్చేందుకు 2015లో పెద్దఎత్తున ప్రచారం చేపట్టామని, 800 మిలియన్ బల్బులను వినియోగంలోకి తీసుకొచ్చామని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఎల్పీజీ ఉండాలన్న ఉద్దేశంతో గత మూడేళ్లలో 3.5 లక్షల కనెక్షన్లను అందజేశామని తెలిపారు.

# లాలూకు మరో ఐదేళ్లు జైలు

దొరాండా ఖజానా ద్వారా రూ.184కోట్లు అక్రమంగా పొందినట్లు కేసులు ఉన్నాయి. వీటికి సంబంధించిన తీర్పులు కూడా త్వరలోనే వెలువడనున్నాయి.

# ఘనంగా శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలు ప్రారంభం




విశాఖపట్నం: షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారి ఆధ్వర్యంలో శ్రీ బాలస్వామి పర్యవేక్షణలో విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీక్షాధరణతో ప్రారంభమై గణపతిపూజ, పుణ్యహవాచన, పంచగవ్యప్రాసన, అగ్నిమధనం, లక్ష్మీ గణపతి హోమం, శ్రీ యజుర్వేదసహిత యాగం నిర్వహించారు. అనంతరం శ్రౌత సభలను స్వామివారు ప్రారంభించి యజుర్వేద సహిత యాగం, శ్రీ వనదుర్గా హోమం నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా శ్రీ స్వామివారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఘనంగా నిర్వహించినట్లే ఈ సంవత్సరం కూడా యావత్ భారతదేశంలో ఉన్న అగ్నిహోత్రులు అంటే బ్రాహ్మణులతో వేదం చెప్పకొనేవారు, పౌరోహిత్యం చేసుకునేవారికంటే విలక్షణంగా ఉంటూ భారతదేశం యొక్క ఔన్నిత్యాన్ని చాటి చెప్పేవారే ఈ అగ్నిహోత్రులు. నిష్ణాతులైన శ్రీ కృష్ణశర్మ పండితులచే వనదుర్గాహోమం, రాజశ్యామల వంటి అమ్మవారికి సంబంధించిన అనేక హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీ శారదాపీఠం ట్రస్టీలు పొగరు సన్యాసి రావు, చాగంటి ప్రకాశరావు, చల్లా రామారావు, రొబ్బి శ్రీనివాస్, పీఠం ధర్మాధికారి జి.కామేశ్వరశర్మ, కృష్ణశర్మ, తిరుపతిరెడ్డి అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### లోకంలో ఉన్న సఖల జనులు సుఖశాంతులతో వర్ధిల్లాలి

**శారాధా ఫీఠధిపతి జగద్గురుశ్రీ స్వరూప నందేంద్ర సరస్వతి మహాస్వామి**

పెందుర్తి : లోకంలో ఉన్న సఖల జనులు సుఖ శాంతు లతో వర్ధిల్లా లని ఆకాంక్షిస్తూ విశాఖ శ్రీ శారాధా ఫీఠం ప్రత్యేక పూజలు జరిపిస్తున్నామని శారాధా ఫీఠధిపతి జగద్గురుశ్రీ స్వరూప నందేంద్ర సరస్వతి మహా స్వామి అనుగ్రహ భాష్యం చేసారు. శారాధా ఫీఠం వార్సికోత్సవం పురష్కరించుకొని ఫీఠంలో స్వామి వివిధ దేవతా మూరు_తలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీ మాట్లాడుతూ ప్రజలందరు ఏ ఇబ్బందులు, కష్టలు పడ కుండా సుఖవంతమైన జీవితాన్ని గడపలనే ఉద్దేశ్యంతోనే ఫీఠం లో వార్షికోత్సవ పురష్కరించుకొని యాగాలు, యజ్ఞలు, ప్రత్యేక పూజలు ప్రతి ఏటా జరిపిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ ఫీఠంలో నాలుగు రోజులు పాటు నిర్వహిస్తున్నామన్నారు.




# అందంగా, ఆహ్లాదకరంగా రూపొందిన లాసన్స్ బే పార్క్

- కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : అందంగా, ఆహ్లాదకరంగా రూపొందించిన లాసన్స్‌బే పార్క్‌ను ప్రజలు వినియోగించుకోవాలని జివిఎంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం ఆయన లాసన్స్ బే పార్క్‌ను సందర్శించారు. అందమైన మొక్కలు, పచ్చికబయలు, సేద తీరడానికి వాలు బల్లలు, వాకింగ్ ట్రాక్, పార్క్‌లోపల పరిశుభ్రమైన ప్రజా మరుగుదొడ్లు, పార్క్ ఎంట్రెన్స్‌లో మరింత పరిశుభ్రమైన ప్రజా మరుగుదొడ్లు, ప్రహరీగోడకు అందమైన, ఆకర్షణీయమైన చిత్రాలు, ఎక్కడికక్కడ డస్ట్‌బిన్స్‌తో అలరారుతోంది. ఉదయం వాకర్స్‌తో కళకళలాడుతోంది. హైమాక్స్ లైట్లు వేయడంతో రాత్రిపూట కూడా పార్క్‌ను వినియోగించుకోడానికి అవకాశం కల్పించారు. పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఎక్విప్‌మెంట్స్ అమర్చారు. బీచ్ వద్ద పరిశుభ్రమైన తీర ప్రాంతం స్వచ్ఛతకు తీర్మాణంగా నిలుస్తోంది. స్వచ్ఛమైన పరిసరాలు, చల్లని పిల్లతెమ్మెరలు, కనులకు ఇంపైన వాతావరణంతో ప్రజలకు ఆహ్వానం పలుకుతోంది. ఎటువంటి దుర్వాసన లేనివిధంగా లాసన్స్‌బే పార్క్ ఎంతో అందంగా ఆకర్షణీయంగా రూపొందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లాసన్స్‌బే పార్క్‌ను మరింతమంది ప్రజలు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ నల్లనయ్యను ఆదేశించారు.

పిల్లలను ఆకర్షించడానికి మరింత ప్లే ఎక్విప్‌మెంట్, మొక్కలను పెంచాలని, ఉన్న మొక్కలకు ప్రూనింగ్ చేయాలని ఎడిహెచ్ దామోదర్‌ను ఆదేశించారు. గతంకంటే లాసన్స్‌బే పార్క్‌ను ప్రజలు వినియోగించుకుంటున్నట్లు జోనల్ కమిషనర్ నల్లనయ్య పేర్కొన్నారు. పర్యటనలో ఎసిపి నాయుడు, ఇఇ శ్రీనివాస్, విద్యుత్ ఎఇ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహా కామేశ్వరి పీఠంలో ఘనంగా రథసప్తమి వేడుకలు

- సౌర మంత్రాలతో స్వామి వారికి క్షీరాభిషేకాలు



పెందుర్తి : సాధుమఠం దరి శ్రీ మహా కామేశ్వరి పీఠంలో రథసప్తమి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ మూర్తి వారి మహా సౌర మంత్రాలతో అఖండ క్షీరాభిషేకాన్ని మహర్షి యద్దనపూడి అయ్యన్నపంతులు నిర్వహించారు. అనంతరం మహాసౌర పఠనం గావించారు. పిడకల తంపితో చేసిన పాయసం శ్రీ సూర్య నారాయణ మూర్తికి నివేదించారు. ఉదయం తొలుత గోపూజ చేశారు. పీఠంలో గల అమ్మవారికి, పరివార దేవతలను పుష్పాలతో, పత్రితో అష్టోత్తర శతనామార్చన గావించారు.

ఈ నెల 31వ తేది ఉదయం 9 గంllల నుండి సాయంత్రం 4 గంllల వరకు పౌర్ణమి సందర్భంగా కాల సర్ప దోష నివారణ-నాగ శాంతి మహాయజ్ఞం నిర్వహిస్తామని మహర్షి యద్దనపూడి అయ్యన్న పంతులు తెలిపారు.

# ఘనంగా సూర్యనారాయణమూర్తి ఆలయం వద్ద అన్నసమారాధన

అనకాపల్లి : స్థానిక గవరపాలెంలో రుద్రభూమి పక్కన ఎన్నో ఎళ్ల చరిత్ర గల సూర్యనారాయణ మూర్తి ఆలయం వద్ద, రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ రథసప్తమి సందర్భంగా ఆలయం వద్ద, అధ్యక్షులు సూరిశెట్టి వెంకటసింహాచలం, (గురుస్వామి) నేతృత్వంలో శ్రీ గౌరీ మణికంఠ మిత్రమండలి, శ్రీ సిద్ధి నూకాంబిక సిండికేట్ ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారధనకి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ముందుగా స్వామి వారికి తెల్లవారుజామునుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద చిడతలు, తప్పెడ గుళ్ళు, సన్నాయి మేళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గౌరీ



మణికంఠ మిత్ర మండలి సభ్యులు సిద్ధి నూకాంబిక సిండికేట్ సభ్యులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### ప్రతీ రోజా సూర్యనమస్కారాలు చేయాలి

నర్సీపట్నం : అందరూ సూర్యనమస్కాలతో రోజును ప్రారంభిం చాలని మంత్రి అయ్యన్న తనయుడు, అయ్యన్న యువసేన అద్యక్షుడు చింతకాయల విజయబాబు అన్నారు. బుధవారం వేములపూడి గ్రామంలో ఆయుర్వేదిక్ శిక్షణా తరగతుల నిర్వ హించారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీలో మునిగిపోయి అనేక సమస్యలను తెచ్చు కుంటున్నారన్నారు. ప్రతీ రోజా సూర్యనమస్కారాలతో పాటు యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిగర్ల అప్పలనాయుడు, ఎంపీపీ సుకల రమణమ్మ, నర్సీపట్నం పార్టీ ప్రెసిడెంట్ లాలం శ్రీరంగ స్వామి, నాతవరం ఎంపీపీ సింగంపల్లి సన్యాసిదేముడు, నాతవరం మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

### అంతరాష్ట్ర యువజనోత్సవాలకు

# ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యార్ధినులు



అచ్యుతాపురం: అంతరాష్ట్ర యువజనోత్సవాలకు ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనువాసరావు బుధవారం విలేకర్లకు తెలిపారు. ఈ అంతరాష్ట్ర యువజనోత్సవాలలో 15రోజులపాటు వివిధ సాంస్కృతిక అంశాలు, పలు కార్యక్రమా లపై శిక్షణ ఉంటుందన్నారు.

పంజాబ్ రాష్టం నుండి 50 మందికి, ఆంధ్ర రాష్ట్రం నుండి 50 మందికి విశాఖపట్నంలో ఈ శిక్షణ కార్యక్రమం వుంటుందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 50 మందికి అవకాశం వుండగా వారిలో తమ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థి నులు ఎంపిక కావడం పట్ల కళాశాల ఛైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర సభ్యులు నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా రథసప్తమి మహోత్సవం




విశాఖపట్నం : అల్లిపురం వెంకటేశ్వర మెట్ట శ్రీ అలమేలు మంగమ్మ దేవాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ సూర్య నారాయణస్వామి వారి దేవాలయంలో మాఘ మాసం సందర్భంగా రథసప్తమి మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినాము. రథసప్తమి సందర్భంగా ఉషాఛాయాదేవి సమేత శ్రీ సూర్యనారాయణస్వామి వారికి పంచామృతాభిషేకము నిర్వహించి తదుపరి అష్టోత్తరము ప్రత్యేక పూజలు అమ్మవార్లకు కుంకు మార్చనలను ఆలయ అర్చకులు వైకానస ఆగమ సాంప్రదాయంలో ఘనంగా నిర్వహించారు. తదుపరి శ్రీ స్వామి వారికి నివేదన, నీరాజన, మంత్ర పుష్పములు సమర్పించడమైనది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉషాఛాయాదేవి సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ ధర్మకర్త యల్లపు హరికృష్ణ, ఆలయ ప్రతినిధి యల్లపు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# నగర ర్యాంకింగ్ కోసం స్వచ్ఛత యాప్ వినియోగించండి

**- కమిషనర్ హరినారాయణన్**




విశాఖపట్నం : స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంక్‌ను భారతదేశంలో విశాఖ నగరం 2017లో 3వ ర్యాంక్ సాధించి అందరినీ ఆకట్టుకోవడం ప్రజల సహకారంతోనే సాధ్యపడినట్లు జివిఎంసి కమిషనర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. కేవలం ఒక్క నిమిషం కేటాయించి స్వచ్ఛతపై వారి అభిప్రాయాలను మూడింటిలో ఏదో ఒక అంశంతో తెలియజేయడం వలన ర్యాంక్ ఆధారపడి ఉన్నట్లు అభిప్రాయ పడ్డారు. మీ సెల్ ఫోన్‌లో స్వచ్ఛత యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా గానీ, 1969 ఉచిత కాల్ నెంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు వారి అభిప్రాయాలను తెలియ జేయ వచ్చునని పేర్కొన్నారు.పై మూడు విధానాల్లో ఏదో ఒక్క విధానం ద్వారా మాత్రమే అభిప్రాయం తెలియజేయాలని కోరారు. కావున ప్రజలు స్వచ్ఛతకు, ర్యాంక్‌కు సహకరించాలని పేర్కొన్నారు.

# వైభవంగా రథసప్తమి వేడుకలు



అనకాపల్లి : పట్టణంలో ఈశాన్య ప్రాంతంలో వెలసిన సుంకరమెట్ట శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం వద్ద బుధవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా ఉదయం నుంచి స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు ప్రత్యేక సూర్యనమాస్కారాలను ఆచరించి ప్రత్యేక ప్రార్దనలు చేశారు. కేవీస్ బాబు ఆర్ధిక సహాయంతో 7వేల లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. భక్తులకి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, ఆలయ చైర్మన్ ధనల విష్ణుచౌదరి తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, విల్లూరి రమణ బాబు, మళ్ల పద్మ, నాదముని ఫణివర్మ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అనకాపల్లి మండలంలో రాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సూర్యనారాయణస్వామి దేవస్థానం వద్ద బుధవారం రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా తెల్లవారుజామునుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారి రథాన్ని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. జిల్లా నలుమూలల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని దర్సించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. దర్సనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులకు ప్రసాదం పంపిణీ చేసారు. స్వామివారిని దర్సించుకున్నవారిలో మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపితీ అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రులు కొణతాల రామకృష్ణ, దాడి వీరభద్రరావు, ప్రముఖ పారిశ్రామిక వేత్త పరుచూరి భాస్కరరావు, వైసీపీ నాయకులు గుడివాడ అమర్‌నాథ్, కరణం ధర్మశ్రీ, ఆళ్ల నాగేశ్వరరావు, జాజుమల రమేష్, వేగి త్రినాథ్, గొర్లి సూరిబాబు, పట్టణ సిఐ ఎస్. విద్యాసాగర్, మళ్ల సురేంద్ర, రాంకీ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ, రూరల్ సిఐ రామచంద్రరావు, కొయ్య ప్రసాద్‌రెడ్డి, భీమిలి శ్రీకాంత్, పరవాడ మాజీ ఎంపీపీ నీలబాబు, మలసాల కిషోర్ ఉన్నారు. స్వామివారి దర్సనానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ వ్యవస్థాప చైర్మన్ కొణతాల బాబురావు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.



### బాలుడి ఆచూకీ లభ్యం

కంచరపాలెం : అనాథ ఆశ్రమం నుండి బాలుడు తప్పిపోయిన ఘటన కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ నెల ఇరవై రెండున బాలుడు హోం నుండి తప్పిపోయినట్లుగా హోం నిర్వా సితులు మంత్రి పలు పోలీసులు ఫిర్యాదు చేశారు. .వివరాల్లోకి వెళ్తే అరుకుకు చెందిన అనాథ బాలుడు వంతుల వారి జోసఫ్ సంక్రాంతి సెలవులకు సొంత గ్రామమైన అరుకుకు వెళ్లాడు సెలవు అనంతరం జోసెప్పు బంధువులు అనాథ ఆశ్రమముకు పంపారు హోంలో ఉండడం ఇష్టం లేని జోసెఫ్ హోం నుండి తప్పించు కుని అరుకు పారిపోయాడు దీంతో హోం నిర్వాహకులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో అరుకులొ ఉన్నట్టుగా తేలడంతో జోసెప్పు పోలీసులు విశాఖ తీసుకుని వచ్చారు. అనం తరం హోం అధికారులకు పోలీసులు జోసెఫ్ ను అప్పచెప్పారు ఈ కేసును దర్యాప్తు ఉమా వెంకటేశ్వరావు చేశారు.

# విజయభాను

## సంపాదకీయం

## అసమ అభివృద్ధిపై దృష్టి

రెండు దశాబ్దాలుగా మన దేశం అభివృద్ధి బాటన పరుగులు తీస్తున్నదనేది కాదనలేం. తాజా ఆక్స్‌ఫామ్ సర్వే కూడా పది వర్థమాన దేశాల్లో భారత్ స్థితి ఆశాజనకంగా ఉన్నదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కోట్లాది మంది పేదలున్న భారత్‌లో అభివృద్ధితోపాటు సంపద పంపిణీపై దృష్టి కేంద్రీకరించాలి. మన విధానాలలో ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల ప్రధానాంశం కావాలె. ఉపశమన చర్యలు అభివృద్ధి పథకాలుగా భావించకూడదు. సంక్షేమ పథకాలతోపాటు, జీవన ప్రమాణాలను మెరుగుపడే దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగించే పథకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు ప్రారంభానికి కొన్నిగంటల ముందు- ప్రపంచవ్యాప్తంగా సంపద సృష్టి, దాని పంపిణీలో అసమానతలపై ఆక్స్‌ఫామ్ సంస్థ భీతిగొలిపే వాస్తవాలను ప్రపంచం ముందు ఉంచింది. 370 కోట్ల మంది జీవితాలు ఎదుగూ బొదుగూ లేకుండా ఉంటే, రెండు రోజులకో బిలియనీర్ పుట్టుకొస్తున్నాడని పేర్కొన్నది. ప్రపంచంలోని 82 శాతం సంపద ఒక శాతం చేతుల్లోనే పోగవుతున్నదని స్పష్టంచేసింది. ఈ సంపద కేంద్రీకరణ 2010 నుంచి వేగంగా పెరుగుతున్నదని, కోటీశ్వరుల సంపదలో 13 శాతం పెరుగుదల ఉండగా, కార్మికుని నెల జీతంలో మాత్రం రెండు శాతం మాత్రమే పెరుగుదల ఉన్నదని ఆక్స్‌ఫామ్ వాపోయింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల పరిస్థితి ఈ విధంగా ఉంటే భారత్ పరిస్థితి దీనికి భిన్నంగా ఏమీ లేదని ఆక్స్‌ఫామ్ సర్వే వివరించింది. ఈ సర్వే ప్రకారం 58 శాతం సంపద ఒక శాతం చేతుల్లోనే ఉన్నది. దేశంలోనూ 73 శాతం సంపద 17 శాతం మంది వద్దనే పోగై ఉన్నది. కాగా అరువై కోట్ల మంది సంపద ఒక శాతం మాత్రమే పెరుగగా, 2017 ఏడాది కాలంలోనే దేశంలో కొత్తగా ఎంతోమంది కుబేరులు పుట్టుకొచ్చారు. ఈ ఏడాది కాలంలోనే కోటీశ్వరుల సంపద 20.9 లక్షల కోట్లు పెరిగింది. అదే కార్మికుల జీతాల్లో మాత్రం నామమాత్రం పెరుగుదల కూడా లేదు. సమ్మిళిత అభివృద్ధిలోనూ మన దేశం పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక కన్నా వెనుకబడి ఉండటం గమనార్హం. అంటే మన దేశంలో అనుసరిస్తున్న అభివృద్ధి విధానాల ఫలితంగా సంపద సృష్టి జరుగుతున్నా అది పేదలకు చేరటం లేదని తేటతెల్లమవుతున్నది. వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్)లో అభివృద్ధి, సంపద సృష్టిపై చర్చ జరుగనున్న నేపథ్యంలో ఆక్స్‌ఫామ్ సర్వేకు విశేష ప్రాధాన్యం ఉన్నది. అభివృద్ధి జపం చేస్తున్న దేశాలన్నీ సామాజిక అంతరాలకు కారణమవుతున్న విధానాల్లో మార్పులు చేయాల్సిన ఆవశ్యకతను తాజా అధ్యయనం నొక్కి చెబుతున్నది. పారిశ్రామిక విప్లవాల అనంతరం ప్రపంచవ్యాప్తంగా వస్తూత్పత్తి పెరిగి సంపద విపరీతంగా పోగు కావటం ప్రారంభమైంది. ఈ ఆధునిక ప్రపంచంలో ప్రభుత్వాలు సంపద సృష్టిపై పెడుతున్న శ్రద్ధ దాని పంపిణీపై పెట్టడంలేదు. దీంతో ఆదాయ తారతమ్యాలు, ఆర్థిక వ్యత్యాసాలు అంతులేకుండా పెరిగిపోయాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక అశాంతితో పాటు సామాజిక ఆందోళనలూ పెచ్చరిల్లాయి. ఈ నేపథ్యంలోనే సంపద సమ పంపిణీ కోసం అనేక వాదాలు ముందుకువచ్చాయి. స్వేచ్ఛా మార్కెట్‌పై పరిమితులు విధించడంతో పాటు, వనరులపై గుత్తాధిపత్యం ఉండకూడదనే భావన ఏర్పడ్డది. కానీ ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత స్వేచ్ఛా మార్కెట్ మినహా మరో మార్గం లేదనే వాదనకు బలం చేకూరింది. బ్లాక్ పాంథర్స్ ఉద్యమం మొదలుకొని నేడు అనేక దేశాల్లో కొనసాగుతున్న అలజడులు, ఆందోళనలకు మూలాలు సంపద అసమ పంపిణీలో ఉన్నాయనే వాదన కూడా కొట్టిపారేయలేనిది. సంపద సృష్టిలో అగ్రరాజ్యాలకు ఆమడ దూరంలో ఉన్నప్పటికీ స్వీడన్ తదితర స్కాండినేవియా దేశాలు సామాజిక శాంతిని నెలకొల్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రారంభోపన్యాసం ఇవ్వడాన్ని ఒక చారిత్రక సందర్భంగా భావించాలె. ప్రపంచ ఆర్థిక సదస్సు వివిధ దేశాలలోని అసమ అభివృద్ధిపై దృష్టిసారిస్తే మంచిది. ప్రస్తుత అభివృద్ధిలో విధానాలలో సూక్ష్మస్థాయిలో జీవన ప్రమాణాల ఎదుగుదలకు చోటు ఉండటం లేదు. సంక్షేమ పథకాలతో సరిపుచ్చుతూ సామాజికాభివృద్ధిని పట్టించుకోవడం లేదు. మౌలిక సదుపాయాలు, నిర్మాణాలతోనే అభివృద్ధి జరిగిపోతుందనే భావన ప్రాధాన్యం పొందుతున్నది. దీంతో అభివృద్ధి ఫలాలన్నీ కొద్దిమందికే పరిమితమై, అత్యధిక శాతం మంది జీవన ప్రమాణాలు పెరుగడం లేదు. రెండు దశాబ్దాలుగా మన దేశం అభివృద్ధి బాటన పరుగులు తీస్తున్నదనేది కాదనలేం. తాజా ఆక్స్‌ఫామ్ సర్వే కూడా పది వర్థమాన దేశాల్లో భారత్ స్థితి ఆశాజనకంగా ఉన్నదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కోట్లాది మంది పేదలున్న భారత్‌లో అభివృద్ధితోపాటు సంపద పంపిణీపై దృష్టి కేంద్రీకరించాలి. మన విధానాలలో ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల ప్రధానాంశం.



ఫిబ్రవరి 2 3 4 తేదీలలో విశాఖపట్నం వి-కన్వెన్షన్ హాల్ నందు జరగబోయే మన పండగ ఫోటో ట్రేడ్ షో పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఈ కార్యక్రమంలో ఎడిట్ పాయింట్ రమేష్, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ విశాఖపట్నం జనరల్ సెక్రటరీ లోకేష్ కుమార్, సురేష్, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.



ఇటీవల స్వర్గస్తులైన కలిదిండి సీతారామరాజు గారి చిత్రపటానికి నివాళులర్పించి ఆ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసిన రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డి, విశాఖ నగర వైయస్ఆర్ సిపిఅధ్యక్షుడు డా విజయ ప్రసాద్ మళ్ళ తదితరులు

## ప్రజలకు చేరువలో ఎయిర్ పోర్ట్ పోలిస్ స్టేషన్ ..

### త్వరలో కమిషనరు చేతుల మేదుగా ప్రారంభం

### ఎయిర్ పోర్ట్ సి.ఐ మళ్ల శేషు



విశాఖ క్రైం : ప్రజలకు చేరువలో ఎయిర్ పోర్ట్ పోలిస్ స్టేషన్ ఏర్పాటు చెయడం జరిగిందని ఎయిర్ పోర్ట్ సి.ఐ మళ్ల శేషు పెర్కొన్నారు.

ఈమేరకు అర్.అండ్.బి కూడలి కంచరపాలెం ట్రాఫిక్ పోలిస్ స్టేషన్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎయిర్ పోర్ట్ పోలిస్ స్టేషన్ లో సేవలను బుదవారం ఉదయం ఆయన ప్రారంబించారు. ఈసందర్బంగా ఆయన మాట్లడుతూ త్వరలో నగర పోలిస్ కమిషనరు చేతుల మేదుగా ఎయిర్ పోర్ట్ పోలిస్ స్టేషన్ పూర్తి స్థాయిలో ప్రారంభిస్తారని సూచించారు. అర్.అండ్ .బి కూడలి పరిది లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిర్ పోర్ట్ పోలిస్ స్టేషన్ లో ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ఎంథగానో ఉపయెగకరంగా, సౌకర్యం వంతంగా ఉంటుందన్నారు. అదేవిదంగా నిత్యం సిబందితో సమిక్ష నిర్వహించి నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో కంచరపాలెం ట్రాఫిక్ సి.ఐ గా విదులు నిర్వహించానని ఇక్కడ ప్రాంతంపై తనకు పూర్తి అవగహన ఉందన్నారు. నేటి నుండి అర్.అండ్ .బి కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఎయిర్ పోర్ట్ పోలిస్ స్టేషన్ లో పిర్యాదు దారులు పోలిస్ సేవలు పొందొచ్చని ఈసందర్బంగా ఆయన తెలిపారు. అంతకు ముందు ఎయిర్ పోర్ట్ పోలిస్ స్టేషన్ లో సేవలు ప్రారంబించిన ఆయన స్టేషన్ లో వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ .ఐ లు నర్శింగరాజు, సురేష్, నాగేశ్వరావు సిబ్బంది పాల్గున్నారు.

## పాక్ ఉగ్రస్థావరాలపై అమెరికా పంజా..!

పరాచినార్, పాకిస్తాన్ : పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై అమెరికా పంజా విసిరింది. బుధవారం డ్రోన్ సాయంతో పాకిస్తాన్-అఫ్ఘనిస్తాన్ సరిహద్దులో అమెరికా చేసిన దాడిలో హక్కానీ నెట్‌వర్క్‌కు చెందిన ఒక కమాండర్, ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు తెలిసింది. అఫ్ఘనిస్తాన్‌లో వేళ్లూనుకున్న తాలిబన్‌కు హక్కానీ నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయి. ఫెడరల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబల్ ఏరియా (ఎఫ్ఏటీఏ) లోని ఓ ఇంట్లో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు సమాచారం అందడంతో అమెరికా డ్రోన్‌తో దాడి చేయాలని నిర్ణయించింది. అనుమానిత స్థలంపై డ్రోన్‌తో రెండు మిస్సైళ్లను వదిలినట్లు పేరు చెప్పడానికి ఇష్టపడిని పాకిస్తాన్ అధికారి ఒకరు చెప్పారు.

## కవి సమయం

### గీతార్థం యిదిగో

- గీత ఒక కల్ప వృక్షము
- అది శ్రీ కృష్ణునిచే నాటబడినది
- వ్యాసునిచే పెంచబడినది
- ఉపనిషత్తులు దాని విత్తనములు
- జ్ఞాన ప్రభోదమే దాని అంకురం
- వివిధ శాస్త్ర రహస్యములు దాని కొమ్మలు
- విషయ విరక్తి, సహనము దాని చిగుళ్లు
- పరమాత్మ యొక్క పద్మముల పాద పద్మముల యందు
- భక్తియే దాని పుష్ప సుగంధం
- మోక్షమే దాని ఫలం
- నీవు దేవునివైపు ఒక అడుగు వేసినచో
- దైవం నీ వైపు పది అడుగులు వేయును
- నీ కర్తవ్యం నీవు చిత్తశుద్ధితో చేసినచో
- దైవం నీవు పొందవలసిన ఫలితం కన్న ఎక్కువే యిచ్చును
- కొండ గృహంలోనికి వెళ్లి అది పలుకలేదే అని తలంపకుము
- నీవు ధ్వని చేయి - అది ప్రతధ్వని చేయును
- ధనముతో వస్తువులను కొనగలము
- కాని మనఃశాంతిని కొనలేము
- ప్రలోభాలకు లొంగని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

... కవితా రచన
శ్రీ స్వామి అప్పాజి భగవాన్
సెల్ నెం: 98486 44336

## పంచాంగం

మాసం : ధనుర్మాస; తిథి : అష్టమి ఉ.10.39; భరణి తె.3.34; మ.వ.1040ల 3.13

బుధవారం 25-01-2018

**మేషం** : విద్యార్థులకు దూర ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా ఏ చిన్న అవకాశం దొరికినా సద్వినియోగం చేసుకోవటం మంచిది. వృత్తుల వారికి అన్ని విధాలా కలిసిరాగలదు. పాతమిత్రుల కలయిక కొత్త అనుభూతినిస్తుంది.

**వృషభం** : వైద్యులకు శస్త్రచికిత్స చేయు నపుడు మెళుకువ అవసరం. ధన వ్యయం, చెల్లింపులలో మెలకువ వహించండి. కాంట్రాక్టర్లు, బిల్డర్లకు నిర్మాణ పనులలో ఊహించని చికాకు లెదుర్కోవలసి వస్తుంది.

**మిధునం** : ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదాపడతాయి. స్త్రీలకు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. భాగస్వామికుల మధ్య కొత్త విష యాలు చర్చకు వస్తాయి. లీజు, ఏజెన్సీలు, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. విద్యార్థి నులకు ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు తప్పదు. మిత్రులను కలుసుకుంటారు.

**కర్కాటకం** : రియల్ ఎస్టేట్ రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. గతంలో నిలిపివేసిన పనులు పునఃప్రారంభిస్తారు. ఖర్చులు పెరిగినా ప్రయోజనకరంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి పంప కాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపారాల్లో పెరిగిన పోటీని తట్టుకోవటానికి బాగా శ్రమించాలి. ఆలయాలను సందర్శిస్తారు.

**సింహం** : సాంఘిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీ పనుల సాను కూలతకు పలుమార్లు తిరగవలసి ఉంటుంది. బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే విషయంలో జాగ్రత్త అవసరం. పాత వస్తువులను కొంటే ఇబ్బందులు తప్పవు.

**కన్య** : రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మీ సమర్థతపై ఎదుటివారికి విశ్వాసం ఏర్పడుతుంది. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. దుబారా ఖర్చులు అధికం.

**తుల** : రావలసిన ధనం చేతికందడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరుతుంది. స్త్రీల పట్టుదల వల్ల కుటుంబ సౌఖ్యం అంతగా ఉండదు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒకానొక సందర్భంలో మిత్రుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది.

**వృశ్చికం** :నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు పురోభివృద్ధి. బంధువుల రాక వల్ల మీరు కొంత అసౌకర్యానికి లోనవుతారు. దైవ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటారు. కోర్టు వ్యవ హారాలు కొత్త మలుపు తిరుగుతాయి. మీ మాటే నెగ్గాలన్న పంతం విడ నాడండి.

**ధనుస్సు** : స్త్రీలు కుటుంబ పరిస్థితులతో సర్దుకుపోవడం క్షేమ దాయకం. నూతన పరిచయాలు మీ పురోభివృద్ధికి నాంది పలుకుతాయి. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ఉపాధ్యాయులు విశ్రాంతికై చేయు యత్నాలు వాయిదా పడ తాయి.

**మకరం** :మనశ్శాంతి కోసం కొన్ని విషయాల్లో సర్దుకు పోవటం క్షేమదాయకం. మీ సంతానం అత్యుత్సాహాన్ని అదుపులో ఉంచటం మంచిది. స్త్రీలకు పనివారితో ఒత్తిడి, చికాకులు తప్పవు.

**కుంభం** : మీ ఏమరుపాటుతనం వల్ల పత్రాలు విలువైన వస్తువులు చేజారిపోయే ఆస్కారం ఉంది. రాజకీయాలలో వారికి ప్రత్యర్థులు పెరుగుతున్నారు అని గమనించండి. ప్రముఖుల కలయికతో పనులు సానుకూలమవుతాయి.

**మీనం** : ఉపాధ్యా యులకు అదనపు బాధ్యతలు, పనిభారం వంటి చికాకులు తప్పవు. స్త్రీలపై శకునాలు, చుట్టుపక్కల వారి వ్యాఖ్యలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాంట్రాక్టర్లకు రావలసిన బిల్లుల వసూలులో ప్రయాసలను ఎదుర్కొంటారు.

## సాయిబాబా చిన్న కథలు



### త్రికరణ శుద్ధి

నేను చెప్పిందొకటి. చేసింది దావికి వ్యతింకం. ఇది పాపమే కదా.''

నేను చేసిన రెండవ పాపము ఏమిటి? ''ఈశ్వర సర్వ భూతానాం'' ''ఈశావాస్యమిదం సర్వం'' ''వాసుదేవ స్సర్వమిదం'' అని అందరికీ బోధిస్తున్నాను. బోధించాను. నేను విశ్వసించాను. కానీ నిన్ను దర్శించటానికి కాశీకి వచ్చాను. అనగా నేను విశ్వసించి చెప్పింది చెయ్యలేదు కదా! ఇదీ పాపమే.'' ఇంక మూడవ పాపము ఏమిటి? క్షేత్ర పర్యటన చేసే వారందరికీ, '''ఏకాత్మా సర్వభూతాంతరాత్మా'' అని ప్రబోధించాను. నేను నమ్మాను. కానీ ఇక్కడ నీవు - నేను అన్న భావము నాలో ప్రవేశించి ఈ విధంగా మాట్లాడించింది. కదా! ఈ మూడు పాపాలను పరిహారం చేసి అద్వైత దర్శనం చేయించి ఆచరణలో పెట్టేటట్లు ఆశీర్వదించు'' అని ప్రార్థించారు.


ఈ విధంగా ఆదిశంకరాచార్యులు లోకానికి ''పాపం అంటే ఏమిటి?'' అన్న విషయాన్ని తెలియజేస్తున్నారు. తలచటం ఒకటి, చెప్పటం ఒకటి, చెయ్యటం మొకటి - ఇది కూడా పాపమే అన్న సత్యాన్ని గుర్తించాలి.

### మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనం

నాలుగు వందల సంవత్సరములకు పూర్వం కాశీపట్టణంలో ''మన్‌సూరి'' అనే సాధుపుంగవుడు ఉండేవాడు. పూర్వజన్మ సుకృతము వల్ల అతని సద్గురు బోధల ఫలితంగా, అతనికి వేదములోని ''అహం బ్రహ్మాస్మి'' అనే మహావాక్యం మీద గురి, విశ్వాసం ఏర్ప డింది. నిరంతరం మన్‌సూరి ''అహం బ్రహ్మాస్మి'' అని ఉచ్ఛ రిస్తుండేవాడు. ఆ మహావాక్యము యొక్క అర్థము ''నేనే బ్రహ్మ''. ఇతను ఈ విధంగా జపించడం కనిపెట్టి అతని వద్దకు వచ్చి కొందరు ''అయ్యా! నిజంగా నీవు దేవుడవేనా?'' అని ప్రశ్నిం చారు. దానికి మన్‌సూరి ''అను నేను దైవమునే'' అని సమాధాన మిచ్చాడు. మన్‌సూరి తానే దైవమని ధైర్యంగా సమాధానం చెప్ప డం దైవ ధిక్కారమని భావించారు కొందరు. అతనిపై ద్వేషము, కోపము పెంచుకున్నారు. అనగా వారికి అద్వైతానుభూతి కలగ లేదు. ఇతనికి కలిగింది. అందువలన అతనిపై అసూయ. కొంత మంది పండితులు, సాధకులు చేరి ఆ దేశపు రాజుకు ఫిర్యాదు చేశారు. ''రాజా! మన్‌సూరి అనే వ్యక్తి వేదాలు, , ఉపనిషత్తులు, పురాణ, ఇతిహాసాలు ఏమీ చదవలేదు. ఎటువంటి కఠినమైన సాధనలు చెయ్యలేదు.'' అటువంటి పరమ ఛాందసుడు ''అహం బ్రహ్మాస్మి'' అని నిరంతరం జపించడం, తానే దైవమని ధైర్యంగా చెప్పడం దైవధిక్కారము అవుతుంది. వేద పండితులకు ఇది అగౌరవము. అవమానకరము. ''అతనికి తగిన శిక్ష విధింప వలసినది'' అని ప్రార్థించారు. రాజు మన్‌సూరిని సభకు పిలిపించాడు. ''అయ్యా! నీవు ఎవరు?'' అని ప్రశ్నించాడు. వెంటనే ఏ మాత్రమూ సంశయించక ''నేను దేవుడను. అహం బ్రహ్మాస్మి'' అని పలికి కన్నులు మూసుకుని మరల ఆ మహా వాక్య మునుచ్చరించడం ప్రారంభించాడు. రాజుకు మతి పోయినంత పని అయింది. వైద్యులను పిలిపించి మన్‌సూరిని పరీక్షించ మన్నాడు. వారు అతనిని పరీక్ష చేసి అతనికి ఏ విధమైన శారీరక, మానసిక రుగ్మతలు లేవిని చెప్పారు.

.. సశేషం

## సంకీర్తన



# జనవరి 25న వైజాగ్ కిట్టీ




విశాఖపట్నం : వీరుమామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైజాగ్ కిట్టీ ఈ నెల 25వ తేదీ శివాజీ పార్క్‌లో గణతంత్ర అవార్డ్స్ పేరిట ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ వీరుమామ తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు భారతమాత వేషధారణపోటి, పిల్లలకు దేశభక్తి వస్త్రధారణ పోటీ, సారీ, గోల్డ్ తంబోలా, దేశభక్తి డైలాగ్స్ మరియు అవార్డ్స్ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3 గంటలనుండి సాయంత్రం 7 గంటలవరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మహిళలు ఎవరైనా హాజరుకావచ్చని ఎటువంటి ప్రవేశ రుసుము లేదని ఈ కార్యక్రమానికి విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మరియు రాష్ట్రమంత్రివర్యులు గంటా శ్రీనివాసురావు ముఖ్యఅతిధులుగా విచ్చేస్తారని, మరిన్ని వివరాలకు 9000594866 నెంబరుకు సంప్రదించవచ్చుఅని ఈవెంట్స్ హెడ్ రమేష్ తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను గంటా శ్రీనివాసరావు, వీ టీమ్‌సభ్యులు ఆవిష్కరించారు.




*మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మత్స్యకారు నాయకులతో మల్లాడి రామారావు, చార్టిబుల్ ట్రస్ట్ చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్ ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం*

# ఉపాధ్యాయులకు శిక్షణ

యానాం : సర్వశిక్షాబియాన్ ఆధ్వర్యంలో రెండవవిడత నెషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే నిర్వహణ నిమిత్తం 39 మంది ఉపాధ్యాయుల కు ఒక రోజు శిక్షణ నిర్వహించినట్లు సర్వ శిక్షాభియాన్ కో-ఆర్డినేటర్ కమిడి ప్రభాకరరావు తెలిపారు.

స్థానిక సర్వశిక్షాభియాన్ సమావేశపు మందిరంలో విద్యాశాఖ అధికారి కాలేసాయినాద్ అధ్యక్షతన ఈ శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. యానాంను ఒక జిల్లాగా నిర్ణయించి 17 పాఠశాల లో 10వ తరగతి చదువుతున్న 620 మంది విద్యార్థులు ఇంగ్లీషు, సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం, తెలుగు భాషలలో ఏ మేరకు ప్రావిణ్యం సాధించారన్న అంశంపై ఫిబ్రవరి 5న నిర్వహించ నున్న పరీక్షకోసం ఉపాధ్యాయులకు తగు శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం పుదుచ్చేరి విద్యాశాఖ గత వారం శిక్షణ కల్పించిందని ఈ పరీక్ష నిమిత్తం జిల్లా కోఆర్డినేటర్‌గా విద్యా శాఖ అధికారి కాలేసాయినాద్, మోనటరింగ్ కోఆర్డినేటర్‌గా కమిడి ప్రభాకరరావు, అసోసియేట్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డి నేటర్‌గా పంపన లక్ష్మణ ప్రావిణ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె. రుద్ర రామ గోపాల్, అకౌంటెడ్‌గా పి. రాజారామోహనరావు లు వ్యవహరిస్తారన్నారు.

# చంద్రన్న బీమా పరిహారం అందచేత



భీమునిపట్నం : భీమునిపట్నం సంగివలస 27 వార్డులో చంద్రన్న భీమా పంపిణీ చేశారు. గతంలో జంపా సూరిబాబు మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులకు చంద్రన్న భీమా ముప్పయి వేల రూపాయుల బాండ్‌ను భీమిలి, పట్టణ టి.డి.పి. అధ్యక్షులు గంటా.నూకరాజు, గాడు. సన్యాసినాయుడు, అందించారు. గంటా.నూకరాజు మాట్లాడుతూ చంద్రన్న భీమా ప్రతీ వ్యక్తి భరోసాగా నిలుస్తూ పేద ప్రజల ఆశాజ్యోతిగా నారా చంద్రబాబు నాయిడు చరిత్రలో నిలిచి పోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వుల్లా .దుర్గారావు, మారోజు.సంజీవ్, డి.వెంకటేష్ గిడుతూరి.శ్రీనివాసరావు, బంగారురాజు, సిహెచ్ పార్వతి, డి.నరసింహరాజు, చంద్రన్న భీమా మిత్ర సభ్యురాలు పోతిన.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గోవింద మాలాధారణ



రావులపాలెం : ఆత్రేయపురం మండలం, వాడపల్లిలో వేంచేసియున్న భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజుల ఆధ్వర్యంలో 45 మంది భక్తులు గోవిందమాలధారణ గావించారు. ఈ మాలధారులు 21 రోజులపాటు స్వామి పూజలో పాల్గొని అనంతరం మాల విసర్జన చేస్తారన్నారు. వీరికి దేవస్థానంచే ఉతిచ దీక్షావస్త్రాలు, భోజన ఏర్పాట్లు చేసామని చైర్మన్ తెలిపారు. ఆత్రేయపురం మండలం, నార్కెడిమిల్లికి చెందిన గుబ్బల ఫణికుమార్ వెంకన్న అన్న ప్రసాద ట్రస్ట్‌కు ఆధునిక ఆవిరి యంత్ర సామాగ్రిని సుమారు లక్ష రూపాయలతో కొనుగోలు చేసి ఫిబ్రవరి 25కు ఆలయానికి అందజేస్తానని ఫణికుమార్ తెలిపారు. ఈ సందర్భముగా స్వామి వారి భోగం ప్రసాదానికి రూ. 18 వేలు విరాళం చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజులకు ఫణికుమార్ అందజేసారు.

## మరొక అరసవల్లిగా పెద్దాపురం

### శ్రీసూర్యనారాయణ స్వామివారి దేవాలయం

పెద్దాపురం : తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం పట్టణంలో అమరగిరి పాండవుల మెట్టపై వేంచేసియున్న శ్రీ పంచాయతన, నవగ్రహ సహిత శ్రీ పద్మిని భామ ఉషాదేవి సమేత శ్రీసూర్యనారాయణమూర్తి 'మాఘమాస రథసప్తమి' కల్యాణ మహొత్సవాలు ఘనంగి నిర్వహించడం జరిగింది. అశేషంగా తరలివచ్చిన భక్తులతో అమరగిరి కిటకిటలాడింది. ఉదయం నుండీ సుప్రభాత సేవలతో ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. విశేషంగా వచ్చిన భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అందరికి అందుబాటుగా ఉంగే విధంగా కార్యకర్తలు చర్యలు తీసుకున్నారు. అశేషంగా భక్తులు రావడంతో పెద్దాపురం శ్రీసూర్యనారాయణ స్వామివారి దేవాలయం మరొక అరసవల్లిని తలపిస్తున్నదని ప్రజలు ప్రసంసించారు.

## బైక్ ఢీకొని ఒకరు మృతి

భీమునిపట్నం : తగరపువలస స్థానిక బైపాస్ రోడ్డులో బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, వేరొకరికి గాయాలయిన సంఘటన జరిగింది. లా అండ్ ఆర్డర్ ఎస్.ఐ శ్రీనివాసరావు ఇచ్చిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో బాలాజీనగర్‌కు చెందిన బొద్దాన నాగరాజు(53) టీ త్రాగడానికి ఇంటి నుంచి బయలుదేరి బ్రిడ్జి దగ్గర రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి వచ్చే బైక్ ఢీకొనడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా బైక్‌పై తగరపువలసకు చెందిన రామత్రినాథ్, భోగాపురం రావివలసకు చెందిన వెంపాడ లక్ష్మణరెడ్డి ఉన్నారు. వీరిలో వెంపాడ లక్ష్మణరెడ్డికి తీవ్రగాయాలయ్యాయనీ ఎస్.ఐ. చెప్పారు. క్షతగాత్రుడిని విశాఖ కెజిహెచ్ కి తరలించగా, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భీమిలి ఎస్. ఐ శ్రీనివాస్ రావు కెసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రత్నగిరిపై ఘనంగా సూర్యనమస్కారాలు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో రథసప్తమిని పురస్కరించుకుని సూర్యనారాయణ మూర్తికి ప్రత్యేక పూజలు పురోహితులుచే సూర్యనామస్కరములు చేశారు. ప్రతి సంవత్సరం పంపా రిజర్వేర్ వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేసేవారు. ఈ సంవత్సరం రామాలయం పక్కన శ్రీ సత్యదేవుని కల్యాణం చేసే మండపంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు స్వామివారి తీర్ధ,ప్రసాదములు అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవోఎం.జితేంద్ర, పాలకమండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది,అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు..

## ఎస్సై పార్ధసారధిని సన్మానించిన నాయకులు



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం జిల్లాలో ఉన్న పోలీస్ స్టేషన్లు అన్నింటిలోను అన్నవరం పోలీసు స్టేషన్ ను ఆహ్లాద కరమైన వాతావరణమును కలిగించడానికి కృషి చేసిన అన్నవరం ఎస్సై పార్ధసారధిని జిల్లా ఎస్పీ విశాల్ గున్ని ప్రత్యేకంగా అభిమానించి 5 వేలు రూపాయలు రివార్డును ప్రకటించన సందర్భంగా అలాగే జిల్లాలోని పోలీసు స్టేషన్లు అన్నింటిలోను ప్రధమస్ధానం రావడంతో అన్నవరం టిడిపి నాయకులు, వైసిపి నాయకులు, రోటరీ క్లబ్ సభ్యులు అన్నవరం గ్రామ పేదలు మరియు టాక్సీ యూనియన్ వారు సబ్ ఇన్స్పెక్టర్ గార్ని మరియు వారి సిబ్బందిని దుశ్శాలువాలతో సన్మానించి మరిన్ని అవార్డులు సాధించాలని అభినందిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాజాల. గంగాభవాని, టిడిపి టౌన్ అధ్యక్షుడు వీర్ల.సూరిబాబు, రాజాల. చిట్టిబాబు, బలువు.రాంబాబు, పలివెల.సతీష్, కర్రి.లోవదొర, బండారు. రాంబాబు, బలువు.రాంబాబు మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ నాయకుడు సరమర్ల.మధుబాబు, రోటరీ క్లబ్ సభ్యులు హరిప్రసాద్, వేణుమాష్టారు తదితరులు పాల్గొన్నారు.

## ఐబిపి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ద్వివేదుల

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం అంతర్జాతీయ బ్రాహ్మణ పార్లమెంట్ ఆంధ్ర ఉపాధ్యక్షునిగా అన్నవరం దేవస్థానం లో వ్రత పురోహితునిగా పనిచేస్తున్న ద్వివేదుల దుర్గా ప్రసాదరావు ( డిడి.ప్రసాద్) నియమితులయ్యారు. ఈ మేరకు ఐబిపి అంతర్జాతీయ బ్రాహ్మణ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ ప్రదీప్ మిశ్రా నియామకం పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఐబిపి రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నానన్నారు. తమ సంస్థల ద్వారా సమాజంలోని పేద బ్రాహ్మణులకు ఇతోదిక సాయం చేస్తున్నామని, భవిష్యత్లో కూడా ఆ సహాయం కొనసాగిస్తామని తెలిపారు. ముఖ్యంగా అన్నవరం, తొండంగి, శంఖవరం చుట్టుపక్కల ఉన్న బీద బ్రాహ్మణులు వారి ఇబ్బందులను తమ దృష్టికి తీసుకువస్తే సంఘ పెద్దలకు తెలియపరిచి వాటి పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామని ద్వివేదుల పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించి కొద్ది రోజులలొనే సంఘ సభ్యులు ద్వారా బీద బ్రాహ్మణుడు అయినటువంటి పేరి రఘునాధానికి ఆర్ధికంగాను అనారోగ్య కారణంగాను ఉన్న ఆయనకు తమ వంతు సహాయాన్ని చేసారు. ఈ కార్యక్రమంలో కాకర సీతారామమూర్తి, ఓలేటి శ్రీనివాసశర్మ , బండి నరసింహమూర్తి , మొక్కరాల సతీష్ , దుడ్డు ధన్వంతరి , ద్విభాష్యం జగన్నాధం , చామర్తి సత్యనారాయణ , కూచిభట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

## దామాపై వైసీపీ వేటు



విశాఖపట్నం : వైసీపీ నేత, రియల్టర్ దామా సుబ్బారావు మాతృశ్రీ, గృహజ్యోతి సంస్థల పేరుతో ప్రజలకు టోకరా వేసి కోట్లాది రూపాయలు సంపాదించడమే కాకుండా హత్యా కేసుల్లో నిందితుడిగా ఉన్న దామా పై మీడియాలో వచ్చిన కథనాలకు స్పందించిన వైసీపీ అతన్ని పార్టీ నుంచి తొలగించింది.

# మూఢనమ్మకాలను యువత అరికట్టాలి




యానాం: మారుతున్న సమాజ పరిస్థితులకు అనుగుణంగా యువత మేధస్సును మెరుగు పరుచుకొని మూఢ విశ్వాసాలను పోగట్టడానికి యువత ప్రయత్నించాలని ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఎంఎస్ఆర్ క్రిష్ణారావు అన్నారు. శ్రీచైతన్య టెక్నోస్కూల్, నారాయణ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులకు బేటీబచావో, బేటీపాడవో ప్రధాన్యం గురించి చైతన్య సదస్సులను సాంఘిక సంక్షేమశాఖ, ఉమా ఎడ్యుకేషన్ సొసైటీలు సంయుక్తంగా నిర్వహించాయి. వివిధ లఘు చిత్రాల ప్రదర్శనలద్వారా బాలిక సంరక్షణ బాధ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో నారాయణ స్కూల్ ప్రిన్సిపల్‌ను ఎం. సురేష్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ ఎన్. ప్రియంకా, ఎస్ఎ నాయుడు, శ్రీదేవి, శ్రీలక్ష్మి, బృందం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాస్యప్ జూనియర్ కళాశాల 8వ వార్షికోత్సవం



విశాఖపట్నం : నగరంలోగల శ్రీ కాస్యప్ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ కళాశాల 8వ వార్షికోత్సవాన్ని స్థానిక మద్దిలపాలెంలో గల కళాభారతి ఆడిటోరియంలో ఉత్సాహంగా, ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవాలను విద్యార్థులు నెహాచౌదరి, ప్రీతిపట్నాయక్, సత్యలక్ష్మి, శివానీ, మొహామద్‌జైనాట్, గాయత్రిలు ఆరంభించారు. కళాశాల సెక్రటరీ మరియు కరస్పాడెంట్ టి.ఆర్.ఎస్. వర్మ, డైరెక్టర్లు ఎస్. నారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ పి సత్యనారాయణ, అకడమి కో ఆర్డినేటర్ కె. వెంకటేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావులు జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి సత్యనారాయణ మాట్లాడుతూ సహనం, తెలివితేటలు, నాయకత్వం, నైపుణ్యం నేటి విద్యార్థులు సొంతం అన్నారు. డైరెక్టర్ ఎస్ నారాయణమూర్తి మాట్లాడుతూ రాబోయే పరీక్షలకు ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. సెక్రటరీ మరియు కరస్పాండెంట్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు.

అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. వివిధ పోటలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తల్లిదండ్రులు, అద్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పత్రికా సంపాదకుని చంపుతానని బెదిరింపులు

### - సి.పి.కి ఫిర్యాదు చేసిన పత్రిక సంపాదకుడు

గాజువాక: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే సబ్సీడీ బియ్యం దొడ్డి దారిన మళ్ళిస్తూ సొమ్ము చేసుకుంటున్న బియ్యం వ్యాపారి పచ్చిగుళ్ళ కృష్ణ పై ఇటీవల నేషనల్ న్యూస్ ఎక్స్‌ప్రెస్ వార పత్రికలతో పాటు అనేక పత్రికలలో ప్రత్యేక కథనాలు వెలువడడం తెలిసిందే. అయితే అక్రమ బియ్యం వ్యాపారి పచ్చిగుళ్ళ కృష్ణ నేషనల్ న్యూస్ ఎక్స్‌ప్రెస్ పత్రికా సంపాదకునిపై కక్షగట్టి, హత్యకు పాల్పడందేకు కుట్ర పన్ని బాధితుని ఇంటికి వెళ్ళి చంపుతానని బెదరింపులకు పాల్పడినట్లు నగర పోలీస్ కమీషనర్‌కు బాధితుడు నేషనల్ న్యూస్ ఎక్స్‌ప్రెస్ సంపాధకుడు కొయిలాడ పరశురామ్ ఫిర్యాదు చేసారు.

ఈ నేపధ్యంలో బుధవారం ఆర్బర్ ఏసీపి రంగరాజు విచారణ నిమిత్తం బాధితుని నుంచి వాగ్మూలం తీసుకున్నారని బాధితుడు కొయిలాడ పరశురామ్ తెలిపారు. నిజాలను ప్రచురించినందుకు తనపై కక్షగట్టి చంపుతానని బెదిరింపులకు పాల్పడడం దారుణమని, తక్షణమే అక్రమ బియ్యం వ్యాపారి పచ్చిగుళ్ళ కృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీపిని కోరినట్లు బాధితుడు కొయిలాడ పరశురామ్ తెలిపారు. మొదట్నుంచి తన వ్యాపారాలకు అడ్డు వచ్చినవారిపై కక్షసాధింపు చర్యలే కాకుండా, అడ్డువచ్చిన వారిని తొలగించేందుకు ఎంతటి పనికైనా వెనుకాడని మనస్తత్వం గలవ్యక్తి బియ్యం వ్యాపారి కృష్ణదని ఆందోళన వ్యక్తం చేసారు. అక్రమ వ్యాపారి కృష్ణ వలన తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని దీనిని సిపి దృష్టికి తీసుకెళ్ళానని, తనకు తన కుటుంబానికి రక్షణ కల్పించాలని, న్యాయం చేయాలని బాధితుడు కొయిలాడ పరశురామ్ కోరారు.


# 36వ రాష్ట్ర మహా సభల పోస్టర్ ఆవిష్కరణ




భీమునిపట్నం : తగరపువలసలో ఎబివిపి ఆధ్వర్యంలో 36వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 26, 27, 28 తేదీలలో రాజమహేంద్రవరంలో జరగనున్నట్లు ఆ కార్యక్రమంలో ప్రతీ విద్యార్థి పాల్గోవాలనీ ఎబివిపి భీమిలి డివిజన్ కన్వీనర్ అచ్చిబాబు, ఎబివిపి టౌన్ స్టడీ సర్కిల్ ఇన్ ఛార్జ్ బి.సత్యనారాయణ చెప్పారు. దానికి సంభందించిన పోస్టర్‌ను బుధవారం ఉదయం స్థానిక వివేకానంద విగ్రహం వద్ద గంటా ప్రతినిధి సి.హెచ్ విజయ్ బాబు, ఎంపిపి యరబాల కృష్ణవేణి, తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొప్పలరమేష్ ఆవిష్కరించారు. అనంతరం విజయ్ బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తి కలిగి ఉండాలనీ తెలిపారు.

ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గాడు వెంకటప్పడు, టీడీపీ నాయకులు అనీల్ ప్రసాద్,జడ్పీటీసీ సరగడ అప్పారావు, కొప్పలకృష్ణ, చిలకానర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ఉమ్మడి గవర్నర్ నరసింహన్ పర్యటన దృశ్యమాలిక


విశాఖ విమానాశ్రయంలో గవర్నర్ నరసింహన్‌కు ఘనస్వాగతం పలికిన రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాసరావు, ఎంపీ అవంతి శ్రీనివాస్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, వుడా వీసీ బసంత్ కుమార్, నగర జేసీపీ నాగేంద్ర కుమార్, తదితరులు


పెందుర్తి గ్రామ సభలో మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్



పెందుర్తి : గ్రామాలు నగరానికి దీటుగా అభివృద్ధి పథంలో ముందుకు పయనిస్తున్నాయని ... రాష్ట్రం అభివృద్ధిలో ముంధంజలో పయనిస్తున్నదనడానికి ఇంతకన్నా ఉదహారణ ఏమి కావాలని రాష్ట్ర గవర్నర్ నరసింహాన్ ఆనందం వ్యక్తం చేసారు. విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం, ఎస్.ఆర్.పురం గ్రామాన్ని గవర్నర్ సందర్శించారు. ఈ గ్రామం స్వచ్ఛభారత్ అవార్డు దక్కించుకుంది. శత శాతం గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మాణాం జరగడం. చెత్త నుంచి ఉత్పత్తులు తమారు చేసి ... ఎస్.ఆర్.పురం రాష్ట్రం ఉత్తమ పంచాయితీగా పేరుగాంచింది. ఈ సందర్భంగా ఈ గ్రామాన్ని సందర్శించడానికి గవర్నర్ ఈ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ప్రభుత్వ పథకాలు పనితీరును తెలుపుతూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను గవర్నర్ పర్యవేక్షించారు. ఆ తరువాత పెందుర్తి ఆంధ్రబ్యాంకు వివిధ లబ్దిదారులకు అందించిన ట్రాక్టర్లను గవర్నర్ ప్రారంబించి లబ్దిదారులను అబినందించారు. ఈ సందర్బంగా ఏర్పాటైన సభలో గవర్నర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందిన నాడే రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలోముందుకు సాగుతుందన్నారు. ఎస్.ఆర్.పురం గ్రామాన్ని నేను నేరుగా పర్యవేక్షించిన తరువాత ప్రభుత్వ పథకాలుల ఇక్కడ ప్రజలకు అందుతున్నట్లు తేలిందన్నారు. ప్రభుత్వం... ప్రభుత్వ అధికారులు కలిసి పని చేస్తేనే అబివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విధ్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు, పార్లమెంటు సభ్యులు ఆవంతి శ్రీనివాసరావు, పెందుర్తి శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి. జిల్లా కలెక్టరు ప్రవీణ్ కూమార్ , జిల్లా స్దాయి అధికారులు, నగర అడిషనల్ సి.పి. రమణమూర్తి పాల్గోన్నారు.
















## పూర్వవిద్యార్థుల స్వర్ణోత్సవాల సంబరాలకు
# గవర్నర్ నరసింహన్‌కు ఆహ్వానం


ఉమ్మడి గవర్నర్ నరసింహన్‌కు అహ్వాన పత్రికను అందజేస్తున్న సనపల బంగారురాజు

కంచరపాలెం : జివిఎంసి మాధవధార స్వర్ణోత్సవాల సంబరాలు ఈ నెల 29, 31, ఫిబ్రవరి 1 వ తేదిలలో నిర్వహస్తున్న సందర్భంగా తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్. నరసింహన్‌ను చైర్మన్‌ను ప్రారంభోత్సవానికి సనపల బంగారాజు బుధవారం అహ్వానించారు. ఈ సందర్భంగా అహ్వాన పత్రికను అందజేశారు. పాఠశాల ఏర్పడి 50 యేళ్ళు అయిన సందర్భంగా పూర్వ విద్యార్ధులకు తమ సందేశాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆయన హజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్ధుల స్వర్ణోత్సవాల కమిటి సభ్యులు సనపల పాండురంగారావు, గొండు అచ్చుతరావు, సనపల మాధవరావు, పేడాడ సత్యనారాయణ, పూర్వ విద్యార్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్, డీసీఐ ప్రైవేటీకరణను ఆపాలి
## మురళీనగర్‌లో మసీదు ఏరియాలో ప్రజలతో సంతకాల సేకరణ




సంతకాలు సేకరిస్తున్న సిపిఎం పార్టీ నాయకులు

మర్రిపాలెం : విశాఖ స్టీల్ ప్లాంట్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రయివేటికరణను తక్షణమే అపాలని 5 లక్షల సంతకాల సేకరణలో భాగంగా బుధవారం మురళీనగర్‌లో గల మసీదు ఏరియాలో ప్రజలతో సంతకాల సేకరణ జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కంచరపాలెం జోన్ కార్యదర్శి బి.పధ్మ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్దిని, ప్రజల ఉపాధిని తీవ్రరంగా దెబ్బతిస్తుందని అన్నారు. అదేవిదంగా తమిళనాడు తరహలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ని, డిసిఐ ప్రయివేటికరణను అపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో సంఘాలు సంతకాల సేకరణలో పాల్గొంటు న్నాయని అన్నారు. ప్రజలు ఈ కార్యక్రమంలో బాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వరంగా సంస్ధలను ప్రయివేటు పరం చేసి ప్రయివేటు వ్యక్తులకు ధారదత్తం చేస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. దీని వల్ల కొన్ని వేల కుటుంబాలు వీధిన పడనున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్.సత్యనారా యణ, జి. సూర్య చంద్రరావు, ఎన్. సింహచలం, టి.కృష్ణమూర్తి, కెఎం.సుదర్శనరావు, జివి.రమణ, సిహెచ్.కమల తదితరులు పాల్గొన్నారు.

# సింహాద్రి అప్పన్న ఖ్యాతిని పెంచండి


గవర్నర్‌కు కరపత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

మర్రిపాలెం : బోగాపురంలో నిర్మించనున్న ఎయిర్ పోర్టు సింహాద్రిఅప్పన్న పేరును నామకరణం చేయ్యాలని గవర్నర్ నరసింహన్‌ను బుదవారం మాధవధార సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య సభ్యులు కలసి కరపత్రాన్ని అంద జేసారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎల్ఎస్. నరసింహన్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అరాధ్య దైవం అయిన సింహాద్రి అప్పన్న పేరును నామకరణం చేయ్యడం వల్ల ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ఎంతో మంచి చరిత్ర కలిగిన సింహాద్రి అప్పన్న పేరు నామకరణం చేసే విదంగా కృషి చేస్తున్న మాధవధార సింహాద్రి అప్పన్న సమైఖ్య సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సనపల నారాయణస్వామి, పొన్నాడ రాంబాబు, సనపల మాధవరావు, సనపల రమేష్‌కుమార్, పంచదార్ల శ్రీనివాసయాదవ్, ఎస్.ధనుంజేయుస్వామి, చౌధరి కళ్యాణ్‌కుమార్, జివి.రమణ, వారణాశి రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## వైష్ణవ ఆలయంలో పందిరి రాటతో ప్రారంభమైన వార్షిక కల్యాణ మహోత్సవం



విజయనగరం: ఉత్తరాంధ్రా బద్రాద్రిగా పేరుగాంచిన జిల్లాలోని అతిపురాతనమైన వైష్ణవ ఆలయం రామతీర్థంలో మాఘమాసంలో జరిగే వార్షిక కళ్యాణ మహోత్సవం బుధవారం మాగశుద్ధ సప్తమి సందర్భంగా పందిరిరాటతో ప్రారంభమైంది. ముందుగా ఆలయ ఆస్థాన మండపంలో ఉన్న ఉత్సవ మూర్తులను కలశ పూజ, అష్టోత్తర నామావళితో వేద పండితులు మంత్రోచ్ఛరణతో తీసుకు వచ్చారు. ఈ నెల 25వ తేదీన విశ్వసేన పూజ, 26న స్వామి వారి మాడ వీధులోంల వాహన సేవ, 27న రధోత్సవం కార్యక్రమాలు నిర్వహించి 29వ తేదీన స్వామి వారికి తేకువ జామున సుప్రభాత సేవ, అవంగకలశారాధన, ధ్వజా ఆరోహణ, నిర్వహించి రాత్రి కళ్యాణ మహొా త్సవాన్ని అత్యంత వైభవంగా జరిపిస్తా మని ఆలయ ప్రధాన పూజారి సాయి ఆచార్యులు తెలిపారు.

## మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచండి

- వినియోగించుకొనేలా చూడండి - కమిషనర్ హరినారాయణన్


విశాఖపట్నం : నగరంలోని అన్ని మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలు వినియోగించుకొనేలా చూడాలని జి.వి.ఎం.సి. కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2018 నిబంధనల అమలుపై అందరు ఇంజినీరింగ్ అధికారులు, జోనల్ కమిషనర్లు, ఎ.ఎం.ఓ.హెచ్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని అన్ని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలు మరుగుదొడ్లను వినియోగించుకొనేలా చూడాలని ఆదేశించారు. 2018 స్వచ్ఛ సర్వేక్షణ్ నిబంధనల మేరకు మరుగుదొడ్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు. ఏమైనా ఒకటి రెండు లోపాలుంటే వాటిని సరిదిద్దాలని అభిలషించారు. అదేవిధంగా రైల్వేస్టేషన్, బస్ స్టేషన్ పరిసరాలలో ఉన్న మరుగుదొడ్లపై దృష్టి సారించి మరింత పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని కోరారు. అన్ని మరుగుదొడ్లలో వాటర్, లైటింగ్, వెంటిలేషన్, బకెట్, మగ్గులు ఉండేలా చూడాలని, ప్రతి మరుగుదొడ్డి వద్ద స్వచ్ఛ భారత్ హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఓపెన్ డిఫికేషన్ ఫ్రీ (బహిరంగ మల మూత్ర విసర్జన రహితంగా) విశాఖ నగరం ఇప్పటికే ధృవీకరణ పొందినట్లు వివరించారు. నగరంలోని అన్ని షాపుల వద్ద డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్లను, రోడ్ల మార్జిన్లను పరిశుభ్రం చేయడంతోపాటు, చెత్త, చిత్తు కాగితాలు లేకుండా ప్రత్యేక చెత్తరహిత, స్వచ్ఛహితంగా రూపొందించడానికి ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. సి.ఎం.ఓ.హెచ్. డా॥ ఎ.హేమంత్ స్వచ్ఛ సర్వేక్షణ్ నిబంధనలు, అనుసరించ వలసిన పద్ధతులను గురించి విశదీకరించారు.

సమావేశంలో ఎడిసిలు జి.వి.వి.ఎస్. మూర్తి, ఎస్.ఎస్.వర్మ, సకలా రెడ్డి, ఎస్ఇలు వినయ్ కుమార్, వేణుగోపాల్, వెంకటేశ్వరరావు, జోనల్ కమిషనర్లు, ఎఎంఓహెచ్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలను బతకనిద్దాం....ఆడపిల్లలను రక్షిద్దాం

నర్సీపట్నం : సమాజంలో ఆడపిల్లలను బతకనిచ్చి వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు డిజి.నాథ్ పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రొచైల్డ్‌గ్రూపు, చైల్డ్ రైట్స్ అడ్వకసీ పౌండేషన్ ఆధ్వర్యంలో బాలలు, తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిజి.నాథ్ మాట్లాడుతూ మహిళా శక్తి అంతా కూడా సమాజానికి ఉపయోగపడితే ఈ ప్రపంచం, దేశం, రాష్ట్ర, ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. బాల్యవివాహాలను అరికట్టి బాలికల అభ్యున్నతికి తోడ్పాటునివ్వాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ఆడపిల్లల హక్కులకు భంగం వాటిల్లకుండా మగపిల్లలతో సమానంగా చూడాలన్నారు. సమావేశంలో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ పౌండేషన్ నర్సీపట్నం ప్రచారకర్త బికెఎం.హిల్డెన్ మాట్లాడుతూ పిండ దశలోనే ఆడపిల్ల అని తెలుసుకని చంపేసే సంస్కృతి ఇంకా పోలేదన్నారు. సమాజంలో ఆడపిల్లలను రక్షించుకుంటే తప్ప భవిష్యత్‌లో ప్రమాదం ఉంటుందన్నారు. ఇంట్లో కూడా మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల్లో ఆడపిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అదుపు తప్పి బైక్ బోల్తా : వ్యక్తికి తీవ్ర గాయాలు



కొయ్యూరు : రాజేంద్రపాలెం సమీపంలో గుడ్లపల్లి సెంటరులో అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.

రేవళ్ల గ్రామానికి చెందిన నరం బన్ను(19) ఏపి05 బిడ్ల్యూఒ 812 నెంబరు గల పల్సర్ బైక్‌పై బండి రిపేరు నిమిత్తం రాజేంద్రపాలెం వచ్చి తిరుగుప్రయాణంలో బైక్ బోల్తా పడింది. స్థానికులు గమనించి వెంటనే రాజేంద్రపాలెం పిహెచ్‌సికి తరలించగా మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బన్ను ప్రస్తుతం రాజఒమ్మంగిలో ఇంటర్ చదువుతున్నాడు.

## చిలకవానిపాలెంలో ఘనంగా బాలికా దినోత్సవం




బాలల దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రావికమతం : రావికమతం మండలం చిలకవానిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.తిరుపతిరావు ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరిగాయి. బాలురతో సమానంగా వారికి అన్ని హక్కులు బాలికలకు ఉన్నాయన్నారు. ప్రపం చంలో బాలికలపై అకృత్యా లను నిలువరించేం దుకు, బాలికల సంఖ్యను పెంచేం దుకు విద్యాభివృద్ధిని పెంపొందించేందుకు బాలికల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.భాస్కరరావు, సిహెచ్.రాజేశ్వరరావు, వై.సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ హత్య



కొయ్యూరు : కొయ్యూరు మండలం డౌనూరు సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. డౌనురు సమీపంలోని జీడితోటల్లో ఎవరో మహిళను హత్య చేసి ముఖంపై పెట్రోల్ పోసి కాల్చివేసినట్లు సమాచారంతో రావడంతో కొయ్యూరు సిఐ ఉదయ్‌కుమార్, ఎస్సై రుగ్మంధరరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# టీటీడీ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు



విజయనగరం: రథసప్తమి సందర్భంగా పట్టణంలోని బుధవారం ఉదయం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులతో టి.టి.డి.దర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు చేశారు. దీనివల్ల మంచి ఆరోగ్యం కలుగుతుందని, మానవులు ధృడంగా ఉంటారని టి.టి.డి. మేనేజర్ తెలిపారు. యోగా గురువు రవిఆచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



**ఏడుగుళ్ళో రథసప్తమి:** పట్టణంలో బాబామెట్టలో ఉన్న ఏడుగుళ్ళలో రథసప్తమి సందర్భంగా అరసవిల్లి లో జరిగిన విధంగా అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచి గుడిలోని సూర్యనారాయణమూర్తి దర్శనార్థం వేలాది సంఖ్యలో బారులు తీరారు. ఆలయ ప్రధాన పూజారి రామాచార్యులు..రథసప్తమి విశేషాలను, పురాణ ఇతిహాసాన్ని భక్తులకు తెలిపారు.

## పద్మావతిని వెండితెరకు దూరం చేయండి

బిజెపి మహిళామోర్చ డిమాండ్





విజయనగరం: ఇటీవల సంచలనాన్ని సృష్టించిన చలన చిత్రం 'పద్మావత్'చిత్రం విజయనగరంలో విడుద లైంది. ఈ సందర్భంగా స్థానిక ఐనక్స్ వద్ద బి.జె.పి మహిళా మోర్చ, పట్టణ బి.జె.పి సంయుక్తంగా బుధవారం ధర్నా నిర్వహిచారు. ఈ సంద ర్భంగా మహిళామోర్చ కార్య దర్శి రేణుసింగ్ మాట్లా డుతూ... చరిత్రకారు లను కించపరిచేవిధంగా ఉన& ఈ చిత్రాన్ని కేంద్ర సెన్సార్ బోర్డ్ నిషేధించాలని డిమాండ్ చేశారు.

చరిత్ర కారులను, చరిత్రను కించపరిచే విధంగా ఉన్న సినిమాలు గతంలో నిషేధించారని గుర్తుచేశారు. ఈ కార్య క్రమంలో పట్టణ బి.జె.పి.అధ్యక్షులు అచ్చిరెడ్డి, యువ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దైవభక్తి వలన మానసిక ప్రశాంతత కలుగుతుంది

వైసీపీ నాయకుడు కొటాన రాము



సీతారామాలయంలో పూజలు చేస్తున్న కొటాన రాము

సబ్బవరం: దైవభక్తి వలన మానసిక ప్రశాంతత కలుగుతుందని వైసీపీ నాయకుడు కొటాన రాము పేర్కొన్నారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం శ్రీ సీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల ఆలయంలో ఉదయాన్నే కొటాన రాము దంపతులు రాములవారికి ఘనంగా పూజలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైవభక్తివలన మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. నిత్యం దైవాన్ని పూజించినప్పుడే మేలు జరుగుతుందన్నారు. దైవానుగ్రహం వలన పాడిపంటలు పండుతాయని దేశం రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. రథసప్తమి రోజున మన గ్రామతీర్థ మహోత్సవం జరగడం మన సుదినం అన్నారు. సీతారాముల తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు, కబడ్డీ పోటీలు, షటిల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు వాలీబాల్ పోటీలకు ప్రథమ బహుమతి రూ.5,000/-లు, ద్వితీయ బహుమతి రూ.4,000/-లు, తృతీయ బహుమతి రూ.3,000లు, కబడ్డీ పోటీలకు ప్రథమ బహుమతి రూ.5,000/-లు, ద్వితీయ బహుమతి రూ.4,000/-లు, మూడవ బహుమతి రూ.3,000/-లు, షటిల్ పోటీలకు ప్రథమ బహుమతి రూ.3,000/-లు, ద్వితీయ బహుమతి రూ.2,000/-, తృతీయ బహుమతి రూ.1500/-లు, నాల్గవ బహుమతి రూ.1,000/-లు ఆలయ కమిటీ వారు అందజేశారు. సాయంత్రం 6 గంటల నుండి బాలనాగమ్మ అనే బుర్రకథ కడురమ్యంగా చెప్పబడింది.

ఈ కార్యక్రమంలో కొటాన అప్పారావు, ఆదిరెడ్డి పోతుబాబు, మడ్డ సూర్యనారాయణ, కొటాన కోటయ్య, కొటాన కృష్ణ, కొటాన కోటేశ్వరరావు, బైలపూడి దేముడు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జీవీయంసీ పాఠశాలలో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



గాజువాక: జీవీయంసీ ప్రాథమిక పాఠశాలలో నగర భాజపా మహిళా మోర్చా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బుధవారం గాజువాక జీవీయంసీ ప్రాథమిక పాఠశాలలో బాలికలను నగర భాజాపా మహిళా మోర్చా అధ్యక్షురాలు జి.ప్రేమకుమారి కలిసారు. ఈ సందర్భంగా బాలికలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ బాలికల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో రాణించే విధంగా భాజపా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. బాలికలను ప్రోత్సహించే విధంగా ప్రధాని నరేంద్రమోది ముందు చూపుతో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. బాలికలకు రక్షణ, అభివృద్ధి, బంగారు భవిష్యత్ కోసం సుకన్య, సమృద్ధి, బేటీ బచావో, బేటీ పడావో తదితర పథకాలను ప్రధాని నరేంద్రమోది ప్రవేశపెట్టి బాలికల ఉన్నతికి పాటుపడుతున్నారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టె పథకాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని, విద్యతో మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని అన్ని రంగాలలో బాలికలకు రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా సభ్యులు వి.లలిత, మాధవిలత, జె.భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### దాడులపై రాస్తారోకో

విజయనగరం: రాష్ట్రంలో దళితులపై దాడులు అధికమౌతున్నాయని. దాడి చేసిన పెత్తందార్లను ఒదిలి వారిని పరామర్శించడానికి వచ్చిన వారిని అరెస్టు చేయడం అమానుషమని ఏ.ఐ.టి.యు.సి కార్యదర్శి టి.వి.రమణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్.టి.సి. కాంప్లెక్స్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారొకో జరిగింది. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం గొట్టిపాడులో పెత్తందార్లు దళాతులపై దాడులు చేస్తే...వారిని పరామర్శించటానికి వెళ్ళిన రాష్ట్ర సి.పి.ఎం.కార్యదర్శి మధును అరెస్ట్ చేశారని ఉదహరించారు.

## పరవాడలో మద్యం దుకాణం సీజ్




పరవాడ: పరవాడ సినిమాహల్ జంక్షన్‌లో గల మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ రొంగలి శ్యామల తెలిపిన వివరాలు ప్రకారము పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో గల మరిడిమాంబ వైన్స్ నుండి బెల్ట్‌షాపులుకు మద్యం రవాణా చేస్తుండగా మార్గమధ్యలో గాజువాక, సబ్బవరము ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకొని ఇరవై మూడు మద్యం కేసులను అదుపులోకి తీసుకొని పరవాడలోగల మరిడిమాంబవైన్స్‌ను సీజ్ చేసామని అన్నారు. అనంతరము వారిపై 34ఎ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎక్సైజ్ ఎస్ఐ శ్యామల తెలిపారు.

## రామాలయం వద్ద ఘనంగా గోపూజ



పరవాడ: సమరసత సేవాఫౌండేషన్ ఆద్వర్యములో పరవాడ రామలయము వద్ద రథ సప్తమి సందర్భముగాగోమాత కు ప్రజలు విశేషమైన పూజలు నిర్వహించారు. మండలకన్వినర్ చుక్క సన్యాశిరావు గోమాతకుకాళ్ళు కడిగిసాస్త్రోక్తముగా పూజా కార్యక్రమము నిర్వహించారు. గ్రామములో ప్రతీవారు ఆయు రారోగ్యముగా వుండాలనిపూజలుచేశారు. ఈ కార్య క్రమములో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గోపూజ చేసి ప్రదక్షిణ చేసారు. గోమాత విశిష్టతను తెలియజేశారు. ఈ కార్య క్రమములో సభ్యులు కె.గంగాధర్, వెన్నెల అప్పలనాయుడు, వర్రి సత్యనారాయణ ,రెడ్డి రమణమ్మ ,వానపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.



**విద్యుదాఘాతంతో గాయాలపాలై కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికను ఆదుకోవాలని ఛైల్డ్ రైట్స్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షులు గంట్యాడ శంకరరావు ఏపీఈపీడీసీఎల్‌కు కోరారు. సరైన సదుపాయాలతో అవసరమైన కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించాలని కోరుతూ గంట్యాడ శంకరావు కోరారు. ఈ కార్యక్రమంలో జి.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.**

### నేడు ఆరోగ్య కార్యకర్తల సమావేశం

కొయ్యూరు : ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలతో కొయ్యూరు సిఎహెచ్ పాఠశాలలో ఈ నెల 25న సమావేశం నిర్వహించనున్నట్టు డౌనూరు ఆరోగ్య కార్యకర్త విలేకరులకు తెలిపారు

DISTANCE EDUCATION
B.a., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., All Groups
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414, 99666 99633

DSC + TET
SGT - & S A Social
Group IV & Group
VRO - VRA
క్లాసులు ప్రారంభమయినవి
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414, 99666 99633